


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

27.07.2026

సోమవారం | రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 27

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# కొత్త రైల్వే స్టేషన్

## సికింద్రాబాద్ నుంచి కొమురవెల్లికి

- రూ.6 కోట్లతో స్టేషన్ నిర్మాణం
- సికింద్రాబాద్–సిద్దిపేట మార్గంలో ఏర్పాటు
- నాలుగు డెమో రైళ్లకు హాల్ట్
- మల్లన్న ఆలయానికి 3 కిలో మీటర్ల దూరం
- భక్తులకు ప్రయాణం సులభం
- సికింద్రాబాద్ నుంచి టికెట్ రూ.25
- సిద్దిపేట నుంచి పది రూపాయలే..
- ప్రారంభించిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజయ్

**సిద్దిపేట, జులై 26, అనంతజనశక్తి న్యూస్**
సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న ఆలయానికి వచ్చే భక్తులకు శుభవార్త. కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభం అయింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్‌ను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు మాధవనేని రఘునందన్ రావు, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కే లక్ష్మణ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం తర్వాత.. కేంద్రమంత్రులు, ఎంపీలు కలిసి కొమురవెల్లి పుణ్యక్షేత్రం స్టేషన్ నుంచి సిద్దిపేటసికింద్రాబాద్ డెమూ రైలు నంబర్ 77654ను జెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత అదే రైలులో సికింద్రాబాద్‌కు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వే స్టేషన్ ప్రారంభం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.
హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ రైల్వే స్టేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. కొమురవెల్లి మల్లన్న ఆలయం హైదరాబాద్‌కు సుమారు 85 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. ఇప్పటి వరకు భక్తులు బస్సులు, ఆటోలు మార్చుకుంటూ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఆలయానికి చేరుకోవాల్సి వచ్చేది. కొత్త రైల్వే స్టేషన్ ప్రారంభంతో మల్లన్న క్షేత్రానికి మరింత సులభతరంగా ప్రయాణం కానుందని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ నుంచి ఆలయం కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో భక్తులు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఆలయానికి చేరుకునే అవకాశం లభిస్తుంది.

2లో..

## ఇది ముగింపు కాదు, ఆరంభమే

- ముందు ఇంకా పెద్ద ప్రయాణం ఉంది
- అభిజీత్ దీప్కే ఎమోషనల్ వీడియో
- విద్యార్థుల హక్కుల కోసం ఇంకా పెద్ద ప్రయాణం

6లో..



**న్యూఢిల్లీ, జులై 26, అనంతజనశక్తి న్యూస్**
దేశంలో సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై 37 రోజుల పాటు ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో కొనసాగిన ఆందోళనలకు ముగింపు పలికిన అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే .. ఎక్స్ వేదికగా ఆదివారం ఉదయం ఒక భావోద్వేగ వీడియోను విడుదల చేశారు.

## 'విక్రమ్1' ప్రయోగంతో అంతరిక్ష రంగంలో నవశకం

- మన యువశక్తిని చూసి గర్వపడుతున్నా
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ
- సైన్స్ ఒలింపియాడ్స్‌లో స్వర్ణ పతకాలతో సత్తా చాటిన విద్యార్థులు



2లో..

**న్యూఢిల్లీ, జులై 26, అనంతజనశక్తి న్యూస్**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 136వ ఎపిసోడ్‌లో దేశ యువత సాధిస్తున్న విజయాలపై ప్రశంసల వర్షం కురిపించారు. అంతరిక్షం నుంచి సైన్స్ ఒలింపియాడ్స్ వరకు వివిధ రంగాల్లో యువత అద్భుత ప్రతిభ కనబరుస్తోందని, దేశ యువశక్తిని చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని అన్నారు.

## పంజాబ్, కర్ణాటక పేపర్ లీక్ సంగతేంటి?

- లీకుల మాటేమిటి?
- కాక్రోచ్‌ల మౌనం ఎందుకు..?
- యువత నుంచి ప్రశ్నలకు కాక్రోచ్ పార్టీ దూరం
- వైరల్ అవుతున్న కాక్రోచ్ లీడర్ల వీడియో

2లో..

## హింస కాదు, చర్చలే పరిష్కారం

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై..
- అన్నా హజారే రియాక్షన్

**న్యూఢిల్లీ, జులై 26, అనంతజనశక్తి న్యూస్**
నీట్ పేపర్ లీకేజీపై కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేసిన నిరసనలతో దిగి వచ్చిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. తన పదవికి రాజీనామా చేయడంపై ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే తాజాగా స్పందించారు.



5లో..



## బాలకృష్ణకు చంద్రబాబు పరామర్శ

ఏఐజీలో బాలకృష్ణను పరామర్శించిన సీఎం చంద్రబాబు
హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణను సీఎం చంద్రబాబు పరామర్శించారు. ఏఐజీ ఆసుపత్రికి వచ్చిన సీఎం.. బాలకృష్ణ ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కాకినాడ పోర్టులో సినిమా చిత్రీకరణ సందర్భంగా బాలకృష్ణ గాయపడిన విషయం తెలిసిందే. ఎడమ మోకాలి చుట్టూ ఉన్న కణజాలాల్లోకి రక్తం చేరడం, వాపు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు.. విజయవంతంగా సర్జరీ పూర్తి చేశారు. శస్త్ర చికిత్స అనంతరం ఆసుపత్రిలో కోలుకుంటున్న బాలకృష్ణను ఆదివారం సీఎం పరామర్శించారు.


## డీఎస్సీ అక్రమాలపై లోకేశ్ రాజీనామా చేయాలి

- వైఎస్ జగన్ డిమాండ్
- నిర్వహణలో వైఫల్యాలకు నైతిక బాధ్యత వహించాలి
- సోషల్ మీడియా వేదికగా పలు ప్రశ్నలు

2లో..



## పాకిస్థాన్ ఉగ్రవాద కేంద్రాలు నిర్మిస్తోంది



6లో..

## శస్త్ర చికిత్స అనంతరం వేగంగా కోలుకుంటున్నా



6లో..

**విజయవాడ,జులై 26, అనంతజనశక్తి న్యూస్**
శస్త్ర చికిత్స అనంతరం వేగంగా కోలుకుంటున్నట్టు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఇటీవల వైద్యులు ఆమెకు ఉదర శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. చికిత్స అనంతరం వేగంగా కోలుకుంటున్నట్టు షర్మిల స్వయంగా వెల్లడించారు. ఈ క్లిష్ట సమయంలో తన ఆరోగ్యం గురించి ఆరా తీస్తూ.. త్వరగా కోలుకోవాలని కాంక్షించిన శ్రేయోభిలాషులు, మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి ఆత్మీయత, ప్రార్థనలు, మద్దతు తనకు కొండంత అండగా నిలిచాయని షర్మిల పేర్కొన్నారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ

- రైతులకు పంట రక్షణ, నేల తేమ సంరక్షణపై ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. ప్రత్యామ్నాయ పంటలు, అత్యవసర విత్తన ప్రణాళికను మిషన్ విధానంలో అమలు చేయాలి
- మంత్రి అచ్చెన్నాయుడు

6లో..



# 'విక్రమ్-1' ప్రయోగంతో అంతరిక్ష రంగంలో నవశకం

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల విజయవంతమైన 'విక్రమ్ 1' ప్రయోగం ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో నింపిందని మోదీ పేర్కొన్నారు. ఇది వికసిత భారత్ లక్ష్యంలో ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి రాకెట్ అని, భారత అంతరిక్ష రంగంలో ఇదొక చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. ఒకప్పుడు ఊహించలేనిదాన్ని మన యువ ఆవిష్కర్తలు సుసాధ్యం చేశారని, వారిలో అసాధారణ నైపుణ్యం, పట్టుదల ఉన్నాయని కొనియాడారు. చాలాకాలంగా ప్రైవేటు రంగానికి దూరంగా ఉన్న అంతరిక్ష రంగాన్ని యువత ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని తెరిచామని, దాని ఫలితాలను నేడు ప్రపంచం చూస్తోందని వివరించారు. అంతరిక్ష రంగంలోనే కాకుండా, సైన్స్ రంగంలోనూ మన యువత దేశానికి గర్వకారణంగా నిలుస్తోందని ప్రధాని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సైన్స్ ఒలింపియాడ్స్‌లో భారత విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచారని చెప్పారు. ఈ నెలలో జరిగిన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్స్‌లో మన విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. ఫిజిక్స్ ఒలింపియాడ్స్‌లో మన ఐదుగురు విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించారని, దీంతో భారత్ మొదటి స్థానంలో నిలిచిందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా ఫిజిక్స్ ఒలింపియాడ్స్‌లో భారత విద్యార్థులు స్వర్ణ లేదా రజత పతకాలు సాధిస్తూ వస్తున్నారని గుర్తుచేశారు. కెమిస్ట్రీ ఒలింపియాడ్స్‌లో పాల్గొన్న విద్యార్థులందరూ స్వర్ణ పతకాలు గెలుచుకున్నారని, ఇది ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన అని పేర్కొన్నారు. అలాగే, బయాలజీ ఒలింపియాడ్స్‌లో స్వర్ణంతో సహా పలు పతకాలు, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్స్‌లో రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు సాధించారని వివరించారు. దేశ యువశక్తిని చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని అన్నారు. భవిష్యత్తులో మరింత మంది యువత ఇలాంటి ఒలింపియాడ్స్, హ్యాకథాన్లలో పాల్గొని దేశానికి గర్వకారణంగా నిలుస్తారన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

# కొత్త రైల్వే స్టేషన్

(మొదటి పేజీ తరువాయి)

**రూ.6 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన ఈ రైల్వే స్టేషన్ లకుడారం, దుద్దెడ స్టేషన్ల మధ్య నిర్మించారు. సికింద్రాబాద్-సిద్దిపేట మార్గంలో నడిచే 4 డెమూ రైళ్లకు రెండు అప్, రెండు డౌన్ ఇక్కడ హాల్ట్ కల్పించారు. సికింద్రాబాద్ నుంచి కొమురవెల్లి వరకు టికెట్ ధర రూ.25 కాగా.. సిద్దిపేట నుంచి రూ.10గా నిర్ణయించారు. ఈ స్టేషన్ ద్వారా భక్తులతో పాటు స్థానిక విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు కూడా ప్రయోజనం పొందనున్నారు. కొమురవెల్లి ప్రాంత రవాణా సౌకర్యాల మెరుగుదలకు ఇది కీలక అడుగుగా నిలవనుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.**

# ఉగ్రరూపం దాల్చిన సముద్రం



**- తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**- వాతావరణ శాఖ హెచ్చరికలు**

**అమరావతి, జులై 26, అనంతజనశక్తి న్యూస్**

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత బలపడి రాగల 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది తదుపరి మార్గంలో పయనిస్తూ రేపు పారాదీప్, సాగర్ ద్వీపాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 55 నుండి 65 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. దీనివల్ల సముద్రం తీవ్ర అలజడిగా ఉంటుందని, అలల ఉధృతి పెరుగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అందువల్ల మత్స్యకారులు ఎవరూ బుధవారం వరకు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ముఖ్యంగా 7 మీటర్ల కంటే తక్కువ వెడల్పు ఉన్న చిన్న పడవల వినియోగం ప్రస్తుతం ఎంతమాత్రం సురక్షితం కాదని, మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సముద్రంలో అలజడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున తీరప్రాంత ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల నివాసితులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఇచ్చే సూచనలను పాటిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ MD ప్రఖర్ జైన్ విజ్ఞప్తి చేశారు.

# వైఎస్ షర్మిలకు సర్జరీ త్వరగా కోలుకోవాలి

**- చంద్రబాబు, పవన్, లోకేష్ ట్వీట్లు**

**- త్వరగా కోలుకుని ప్రజా జీవితంలోకి రావాలి**

**విజయవాడ, జులై 26, అనంత జనశక్తి న్యూస్**

ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిలకు వైద్యులు సర్జరీ నిర్వహించారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇటీవల తనకు పొత్తికడుపు శస్త్రచికిత్స నిర్వహించారని.. ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నట్టు షర్మిల ట్వీట్ చేశారు. ఇలాంటి క్లిష్ట సమయంలో తన ఆరోగ్యం గురించి ఆరా తీసిన వారికి.. త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన శ్రేయోభిలాషులకు షర్మిల కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరి ఆత్మీయత, మద్దతు, ప్రార్థనలు తనకు కొండంత అండగా నిలిచాయంటూ.. ఒక ప్రైవేట్ ఆసుపత్రి గదిలో విశ్రాంతి తీసుకుంటున్న తన ఫోటోను పంచుకుంటూ ఆదివారం ఉదయం షర్మిల పోస్ట్ చేశారు.

మరోవైపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్‌సహా పలువురు రాజకీయ నేతలు ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారు.

"శ్రీమతి వై.ఎస్. షర్మిల గారు త్వరగా, పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఆమె మంచి ఆరోగ్యం కోసం ప్రార్థిస్తూ, ఆమెకు ధైర్యం, త్వరగా ఆరోగ్యం చేకూరాలని కోరుకుంటున్నాను.".. చంద్రబాబు నాయుడు

"ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల గారికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తై, వేగంగా కోలుకుంటున్న మీరు సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా ప్రజా జీవితంలోకి రావాలని కోరుకుంటున్నాను.".. పవన్ కళ్యాణ్

"షర్మిల గారు, మీరు త్వరగా కోలుకుంటున్నారని తెలిసి సంతోషంగా ఉంది. మీరు త్వరగా, పూర్తిగా కోలుకోవాలని ఆశిస్తున్నాను. మీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి, మీరు త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలోకి రావాలని కోరుకుంటున్నాను.".. నారా లోకేష్

మరోవైపు నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. అయితే ఏపీసీసీ చీఫ్ షర్మిల ఇందులో కనిపించకపోవటంపై చర్చ జరిగింది. అయితే ఈ అంశాలపై సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు స్పందిస్తూ వచ్చారు షర్మిల. ఆపరేషన్ కారణంగానే ఆమె క్షేత్రస్థాయి పోరాటాల్లో కనిపించలేదని.. షర్మిల తాజా ట్వీట్‌తో వెల్లడైంది.





# పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి

**- అందివచ్చిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తా**

**- నల్గొండ జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ నిమ్మల ఇందిరా**

**నాగార్జునసాగర్,జూలై 26 అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని నల్గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నిమ్మల ఇందిరా స్పష్టం చేశారు. ఆదివారం నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో గతంలో నందికొండ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యురాలిగా ఎన్నుకోవడంతో పాటు,తాజాగా జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తనపై నమ్మకంతో ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు.ఈ పదవులు రావడానికి తమకు అండగా నిలిచి,సహకరించిన ప్రముఖ నాయకులు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి,మాజీ రాజ్యసభ సభ్యులు కే.కేశవరావు (కేకే),కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, జిల్లా పీసీసీ నాయకులు కైలాస్ నేతలకు ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తనకు అందించిన ప్రోత్సాహం మరువలేని దని,అందరి సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని నిమ్మల ఇందిరా వెల్లడించారు.



# పంజాబ్, కర్ణాటక పేపర్

**న్యూఢిల్లీ, జులై 26, అనంత జనశక్తి న్యూస్**

లీక్ సంగతేంటి? నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. కొత్తగా ప్రహ్లాద్ జోషి ఈ శాఖ బాధ్యతలు తీసుకున్నారు. ఇదిలా ఉంటే, ఇప్పుడు యువత నుంచి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కు కొత్త డిమాండ్ ఎదురవుతోంది. పంజాబ్, కర్ణాటక పేపర్ లీకులపై స్పందించాలని కోరుతున్నారు. ఈ రాష్ట్రాల్లో కూడా విద్యాశాఖ మంత్రులు రాజీనామా చేసేలా ఉద్యమం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఈ డిమాండ్లపై సీజేపీ నుంచి మౌనమే ఎదురవుతోంది.

పంజాబ్‌లో ఇటీవల ప్రభుత్వ నియామక పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీక్ ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా ఫార్మసీ ఆఫీసర్ల రిక్రూట్మెంట్ ఎగ్జామ్‌లో అక్రమాలు జరిగాయి. కాంగ్రెస్‌తో పాటు బీజేపీ ఆరోపిస్తోంది. పంజాబ్ ఎడ్యుకేషన్ మినిస్టర్ హర్జోత్ సింగ్ బైన్స్ రాజీనామా చేయాలనే డిమాండ్లు వస్తున్నాయి. పంజాబ్ పీసీసీ చీఫ్ అమరిందర్ సింగ్ రాజా వారింగ్ మాట్లాడుతూ.. కేంద్రంలో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, విద్యాశాఖ మంత్రి బైన్స్ బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు, సీజేపీ పంజాబ్ అంశంపై ఎందుకు మెతక వైఖరి అవలంభిస్తుందని బీజేపీ ప్రశ్నిస్తోంది. కేవలం సెలెక్టివ్‌గా ఉద్యమం చేస్తున్నారని విమర్శిస్తోంది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న కర్ణాటకలో కూడా పేపర్ లీక్ అంశం ప్రస్తావనకు వస్తోంది. కర్ణాటక పబ్లిక్ సర్వీస్ నిర్వహించిన పరీక్షపై ఆరోపణలు వస్తున్నాయి. బీజేపీ, ఆ రాష్ట్ర మంత్రి మధు బంగారప్ప రాజీనామాను కోరుతోంది. ప్రధాన్ రాజీనామా విషయంలో బీజేపీపై ఒత్తిడి పెంచిన కాంగ్రెస్, తన ప్రభుత్వంలోని మంత్రిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తోంది. మరోవైపు, సీజేపీ లీడర్లు పంజాబ్ పేపర్ లీక్ అంశంపై మాట దాటేయడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రధాన్ రాజీనామా తర్వాత జంతర్ మంతర్ వద్దకు వచ్చిన ఆప్ నేత మనీష్ సిసోడియాను అక్కడ ఉన్న విద్యార్థులు ప్రశ్నించడం వైరల్ అవుతోంది. కాక్రోచ్ పార్టీ సీనియర్ నాయకులు సౌరభ్, అశుతోష్ రాణాలను ఒక జర్నలిస్ట్ పంజాబ్ పేపర్ లీక్ గురించి ప్రశ్నించిన నేపథ్యంలో వారు సమాధానాలు చెప్పకుండా కారులో వెళ్లిపోతున్న వీడియో వైరల్‌గా మారింది. ధర్మేంద్ర ప్రధాన్‌పై మాట్లాడిన గొంతుకలు ఇప్పుడు ఎందుకు సైలెంట్ అవుతున్నాయని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.




# డీఎస్సీ అక్రమాలపై లోకేశ్ రాజీనామా చేయాలి



**అమరావతి, జులై 26, అనంతజనశక్తి న్యూస్**

రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షల నిర్వహణ తీరుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో జరిగిన అక్రమాలు, వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారని జగన్ గుర్తుచేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఇది నైతికతకు, బాధ్యతాయుతమైన జవాబుదారీతనానికి నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం చూపిన ఆ నైతిక ప్రమాణాలను ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా అమలు చేయాల్సిన అవసరం ఉందో లేదో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

**రాజీనామాపై లోకేశ్ కు వైఎస్ జగన్ ప్రశ్న...**

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థులు డీఎస్సీ పరీక్షల కోసం రాత్రింబవళ్లు కష్టపడి చదివారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతమంది అభ్యర్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ డీఎస్సీ నిర్వహణలో అంతులేని అక్రమాలకు తెరలేపారని ఆయన ఆరోపించారు. కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఈ వైఫల్యానికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తారా..? అని నిలదీశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు వైఖరిని కూడా వైఎస్ జగన్ తీవ్రంగా తప్పుపట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే రాజకీయ విలువలు, ప్రమాణాలు మరియు జవాబుదారీతనానికి పూర్తిగా పాతర వేస్తూ...సీఎం చంద్రబాబు తన కుమారుడి పదవిని కాపాడుకోవడానికే ప్రాధాన్యం ఇస్తారా అని ప్రశ్నించారు. లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని... ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# పెరుగుతున్న కరోనా కేసులు

**- కొత్తగా 10 నమోదు, 49కి చేరిన సంఖ్య**

**- అప్రమత్తంగా ఉండాలి: వైద్యారోగ్య శాఖ**

**అమరావతి, జులై 26, అనంతజనశక్తి న్యూస్**


ఏపీలో కరోనా వైరస్ వ్యాప్తి మళ్లీ వేగం పుంజుకుంటోంది. గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పట్టినట్లు కనిపించిన వైరస్ పాజిటివ్ కేసులు... ఇప్పుడు క్రమంగా పెరుగుతుండటంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. శనివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 10 కోవిడ్19 కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో నమోదైన మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 49కి చేరుకుంది. కాగా... ఇప్పటివరకు వైరస్ బారినపడి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా వెలుగు చూసిన 10 కేసుల్లో గుంటూరు జిల్లాలో గరిష్టంగా మూడు కేసులు బయటపడగా, ఎన్టీఆర్ జిల్లాలో రెండు కేసులు నిర్ధారణ అయ్యాయి. ఇక అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, తిరుపతి మరియు విశాఖపట్నం జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కొత్త కేసులు నమోదైనట్లు వైద్యారోగ్య శాఖ స్పష్టం చేసింది.

**జిల్లాల వారీగా కేసుల వివరాలు**

రాష్ట్రవ్యాప్తంగా నమోదైన మొత్తం 49 కేసులను పరిశీలిస్తే... అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలో 11 మంది కొవిడ్ బారినపడ్డారు. దీని తర్వాత గుంటూరు జిల్లాలో 9 కేసులు, వైఎస్సార్ కడప జిల్లాలో 8 కేసులు, విశాఖపట్నం జిల్లాలో 5 కేసులు నమోదయ్యాయి. అలాగే ఎన్టీఆర్ జిల్లాలో మూడు, కాకినాడ, ఏలూరు మరియు బాపట్ల జిల్లాల్లో రెండేసి చొప్పున కేసులు నిర్ధారణ అయినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వ్యాధి బారినపడిన వారిలో 24 మంది వివిధ ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. మరో 16 మంది రోగులు హోం ఐసోలేషన్‌లో ఉంటూ, వైద్యుల నిరంతర పర్యవేక్షణలో తమ ఇళ్లలోనే కోలుకుంటున్నారు. వైరస్ బారినపడిన వారిలో ఇప్పటివరకు ఐదుగురు పూర్తిస్థాయిలో కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇక ఇప్పటివరకు చోటుచేసుకున్న నలుగురు మరణాల్లో... ముగ్గురు వైఎస్సార్ కడప జిల్లాకు చెందినవారు కాగా... మరొకరు కాకినాడ జిల్లాకు చెందిన వ్యక్తిగా అధికారులు గుర్తించారు.

**వైద్యారోగ్య శాఖ అప్రమత్తం...**

రాష్ట్రంలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య శాఖ యంత్రాంగం అప్రమత్తమైంది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ... అన్ని జిల్లాల్లో పర్యవేక్షణను మరింత తీవ్రతరం చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆసుపత్రుల్లో ప్రత్యేక బెడ్లను, ఆక్సిజన్ నిల్వలను మరియు అవసరమైన మందులను సిద్ధం చేసినట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మాస్కులు ధరించడం మరియు చేతులు శుభ్రం చేసుకోవడం వంటి నియమాలను పాటించాలని సూచించారు.



# ప్రజా సమస్యలను వదిలేసింది

**- ప్రభుత్వం పబ్లిసిటీ డ్రామాలు ఆడుతోంది**

**- ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ**

**విజయవాడ, జులై 26, అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించి, కేవలం పబ్లిసిటీ కోసమే పాకులాడుతోందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విజయనగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో నీట్ పరీక్షల లీకేజీ వ్యవహారంలో మంత్రి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేసిన ఆయన, రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీనివల్ల సుమారు మూడు లక్షల మంది నిరుద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ అక్రమాలపై తక్షణమే సీబీఐతో విచారణ జరిపించాలని, విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత మంత్రి తన పదవికి రాజీనామా చేసి పక్కకు తప్పుకోవాలని డిమాండ్ చేశారు.

గతంలో స్పోర్ట్స్ కోటా కింద అర్హత ఉన్నవారికి నేరుగా ఉద్యోగాలు లభించేవని, కానీ ఈ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చాక జీవోలను సవరించి తమకు నచ్చిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టుకుందని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ఆరోపణలపై విచారణ జరిపించి క్లీన్ చిట్‌తో బయటకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. రూ. 10,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన బకాయిలు నిలిచిపోయాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్ కొట్టేసేందుకు ప్రభుత్వం అట్టహాసంగా ఊరేగింపులు చేస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగానే భోగాపురం ఎయిర్‌పోర్ట్ వచ్చిందని స్పష్టం చేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 15 వేల ఎకరాలు కావాలని చెప్పి కనీసం భూసేకరణ కూడా పూర్తి చేయలేకపోయారని గుర్తుచేశారు. తమ వైఎస్సార్సీపీ ప్రభుత్వంలోనే అన్ని రకాల క్లియరెన్సులు తీసుకువచ్చి పనులను వేగవంతం చేశామని తెలిపారు.


ఇక విజయనగరంలో వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయంపై పదేపదే మాట్లాడడం సరికాదని హితవు పలికారు. రాజభరణాలు పోయినా ఇంకా రాచరిక మనస్తత్వంతో మాట్లాడటం తగదన్నారు. మాన్సాస్ ట్రస్ట్‌లో అవకతవకలు ఉన్నాయని, దానిని ప్రభుత్వంలో కలపాలని గతంలో ఆనంద గజపతి రాజే లేఖ రాసిన విషయాన్ని అశోక్ గజపతి రాజు కాదనగలరా అని ప్రశ్నించారు. ఈ అంశాలపై తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, కూటమి నేతలు చర్చకు రాగలరా అని బొత్స సవాల్ విసిరారు.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం


# మనం అంతరిక్షం వైపు అడుగులేస్తుంటే.. పాక్ చొరబాటు మార్గాలను వెతుకుతోంది

**- రాజ్‌నాథ్ సింగ్**



రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్థాన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత్ ఇన్నోవేషన్, స్టార్టప్‌లు, స్పేస్ మిషన్ల వైపు అడుగులు వేస్తుంటే.. పాక్ మాత్రం చొరబాటు మార్గాలను వెతుక్కుంటోందని ఎద్దేవా చేశారు. మనం డేటా సెంటర్లను నిర్మిస్తుంటే.. వాళ్లు ఉగ్రవాద కేంద్రాలను అభివృద్ధి చేసుకుంటున్నారన్నారు. ఆ దేశంతో చర్చలంటూ జరిగితే అది పీవోకే కోసమే తప్ప మరే విషయంలోనూ జరగబోవని పేర్కొన్నారు. పీవోకేను పాక్ అక్రమంగా ఆక్రమించుకుందని మండిపడ్డారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని యుద్ధ స్మారక చిహ్నం వద్ద మాట్లాడుతూ కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. 1999లో కార్గిల్ యుద్ధంలో దేశం సాధించిన విజయాన్ని భారతమాత కిరీటంలో పొదిగిన వజ్రంగా అభివర్ణించారు.

పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని తమ దేశ విధానంలో ఒక భాగంగా మార్చుకుందని రాజ్‌నాథ్ సింగ్ దుయ్యబట్టారు. ఉగ్రవాదులను అడ్డు పెట్టుకొని.. భారత్‌ను బెదిరించడానికి ప్రయత్నిస్తే ఏమవుతుందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచమంతా చూసిందన్నారు. పాక్ చేసే ఏ దుస్సాహస చర్యకైనా.. వారి ఊహకందని రీతిలో మన సైన్యం ప్రతిస్పందిస్తుందన్నారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్.. ఇలా ఉగ్రవాద చర్యలపై భారత్ తీవ్రంగా స్పందించిందని గుర్తు చేశారు. 27వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఇతర ఆర్మీ అధికారులు అమరవీరులకు నివాళులర్పించారు.

# ఎద్దేవాతో పుట్టి.. ఎంతో ఎదిగి!

**- కాక్రోచ్ జనతా పార్టీ ప్రస్థానం ఇదీ..**
**- సీజేఐ వ్యాఖ్యలతో మొదలైన ఆన్‌లైన్ ప్రచారం**
**- జెన్ జీ నుంచి అనూహ్య స్థాయిలో ఆదరణ**



మొదలైన కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్, భాజపాలను దాటేసి ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 2 కోట్ల మంది ఫాలోవర్లను సంపాదించుకుంది.. కాక్రోచ్ జనతా పార్టీ. అలాగని ఇదేదో ఎన్నికల కమిషన్‌వద్ద రిజిస్టర్ అయిన రాజకీయ పార్టీ కాదు. కేవలం జెన్‌జీ ఉద్యమం. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలను ఎద్దేవా చేస్తూ మొదలైన ఈ ఆన్‌లైన్ ప్రచారం.. అనతికాలంలోనే ఉద్ధృత రూపం దాల్చింది. ఏకంగా కేంద్ర మంత్రితో రాజీనామా చేయించేంత వరకు ఎదిగింది. బోస్టన్ యూనివర్సిటీలో చదువుకుని, గతంలో ఆమ్ ఆద్మీ పార్టీలో పని చేసిన అభిజీత్ దీప్కే మే 16న దీన్ని ప్రారంభించారు. 'కొందరు యువత బొద్దింకల్లాంటివాళ్లు. వాళ్లకు ఉద్యోగాలు ఉండవు. వృత్తుల్లోనూ ఉండరు. వాళ్లలో కొందరు పాత్రికేయులు, సామాజిక మాధ్యమ కార్యకర్తలు, సమాచార హక్కు చట్టం ప్రచారకర్తలుగా మారి.. అందరిపైనా దాడులు చేస్తారు' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆన్‌లైన్ ప్రచారాన్ని అభిజీత్ దీప్కే ప్రారంభించగా అతికొద్ది కాలంలోనే అతడు సైతం ఆశ్చర్యపోయే స్థాయిలో వేలు, లక్షల్లో యువత దానికి సైనప్ చేశారు.

ముఖ్య నాయకులు వీరే..
సీజేపీలో ప్రధానంగా 10 మంది నాయకులున్నారు. వారు.. అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోశ్ రంకా, విజేత దహియా, సోనమ్ వాంగ్‌చుక్, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి, అమూల్య ధవన్, రోనక్ ఖత్రీ, అర్పిత్ శర్మ.

సంచలన మ్యానిఫెస్టో
ఒకవేళ సీజేపీ అధికారంలోకి వస్తే.. తమ మ్యానిఫెస్టో ఇలా ఉంటుందని చెప్పారు.
ప్రధాన న్యాయమూర్తులెవరికీ పదవీ విరమణ తర్వాత రాజ్యసభ సభ్యత్వం ఇవ్వకూడదు.
ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ఓటు తీసేస్తే సీఈసీని ఉపా కింద అరెస్టు చేయాలి.
మహిళలకు చట్టసభల్లోనూ, మంత్రివర్గంలోనూ 50% రిజర్వేషన్ కల్పించాలి.
అంబానీ, అదానీల మీడియా సంస్థల లైసెన్సులు రద్దు చేయాలి.
ఎమ్మెల్యే, ఎంపీ పార్టీ మారితే 20 ఏళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా, ఏ పదవి చేపట్టకుండా నిషేధించాలి.

పోరాటం ఇలా..
జూన్ 6న అభిజీత్ దీప్కే అమెరికా నుంచి వచ్చి రావడంతోనే జంతర్ మంతర్‌వద్దకు భారీగా యువత తరలివచ్చారు. అప్పట్నుంచి డిజిటల్ ప్రచారం మొదలైంది. 20న జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశారు. 22 నుంచి 27 వరకు కొన్ని వేలమంది వారితో కలిసి నిరసనలు చేశారు. 28న అక్కడకు సోనమ్ వాంగ్‌చుక్ వచ్చి నిరాహారదీక్ష ప్రారంభించారు. అక్కడినుంచి ఉద్యమం మరింత ఉద్ధృతమైంది.

# విద్యార్థి ఉద్యమాల అడుగుజాడలు

**నీట్ యూజీ ప్రశ్నపత్రాల లీక్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన రాజీనామా దేశంలో స్వాతంత్ర్యానంతరం చోటుచేసుకున్న పలు విద్యార్థి ఉద్యమాలను గుర్తుకు తెచ్చింది. ఆయా ఉద్యమాలు ప్రభుత్వాల మూలాలను కుదిపేసి ప్రజల సంఘటిత శక్తిని చాటాయి. విజయవంతమైన కొన్ని విద్యార్థి ఉద్యమాలివీ..**




తమిళనాడు హిందీ వ్యతిరేక ఉద్యమం (1965)
హిందీకి వ్యతిరేకంగా తమిళనాడులో పలు దశాబ్దాల పాటు ఉద్యమం నడిచింది. అయితే 1963లో కేంద్రం ప్రవేశపెట్టిన అధికార భాషా చట్టం ఈ ఉద్యమానికి కొత్త ఊపునిచ్చింది. ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) అభ్యంతరం లేవనెత్తినప్పటికీ బిల్లును పార్లమెంటు ఆమోదించింది. అయితే ఇంగ్లీషు అధికార భాషగా కొనసాగుతుందని అప్పటి ప్రధాని నెహ్రూ హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది. 1964లో నెహ్రూ మరణానంతరం తమిళనాట ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ త్రిభాషా సూత్రాన్ని ప్రవేశపెట్టింది. దీన్ని నిరసిస్తూ విద్యార్థులు వీధికెక్కి నిరసనోద్యమం చేపట్టారు. ఉద్యమం పతాక స్థాయికి చేరిన దశలో జరిగిన ఘర్షణలు, పోలీసు చర్యల పర్యవసానంగా దాదాపు 70 మంది మరణించారు. నెహ్రూ ఇచ్చిన హామీని అమలుపరుస్తామంటూ నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన హామీతో ఉద్యమం సద్దుమణిగింది. ఈ ఉద్యమ పర్యవసానంగా తమిళనాడులో కాంగ్రెస్ అంతర్ధానమైంది.

నవ నిర్మాణ్ ఆందోళన (1974)
గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో ఒక ఇంజినీరింగ్ కళాశాల తన హాస్టల్ మెస్ ఛార్జీలను 20 శాతం మేరకు పెంచడం ఈ ఉద్యమానికి అంకురార్పణ చేసింది. 1974 జనవరి 3న గుజరాత్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు పోలీసులకు మధ్య ఘర్షణ జరిగింది. దీంతో విద్యార్థులు అప్పటి ముఖ్యమంత్రి ఛిమన్ భాయ్ పటేల్ రాజీనామా చేయాలని డిమాండ్‌తో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశారు. జనవరి 25న గుజరాత్ వ్యాప్తంగా సమ్మె జరిగింది. ఈ సందర్భంగా మరోసారి విద్యార్థులకు పోలీసులకు మధ్య ఘర్షణ తలెత్తింది. పర్యవసానంగా రాష్ట్రంలోని 44 పట్టణాల్లో కర్ఫ్యూ విధించారు. పరిస్థితి అదుపు తప్పడంతో దిగివచ్చిన అప్పటి కేంద్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి పటేల్‌ను పదవి నుంచి తప్పించింది.

బిహార్ విద్యార్థి ఉద్యమం లేదా జేపీ ఉద్యమం (1974)
పెరుగుతున్న అవినీతి, బంధుప్రీతిని నిర్మూలించాలని, ఎన్నికల సంస్కరణలతోపాటు విద్యా సంస్కరణలు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ప్రముఖ సోషలిస్టు నేత జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలోని ఛాత్ర సంఘర్ష్ సమితి ఈ ఉద్యమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా చేపట్టిన శాంతియుత ఉద్యమం క్రమంగా పలు విద్యా సంస్థలకు, ఉత్తరాదిలోని ఇతర హిందీ భాషా రాష్ట్రాలకు అనతి కాలంలోనే పాకింది. మాజీ ముఖ్యమంత్రులు నితీశ్ కుమార్, లాలూప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్‌లు ఈ ఉద్యమంలోంచి ఉద్భవించిన నాయకులే కావడం విశేషం. సోషలిజం స్థాపనే లక్ష్యంగా జేపీ ఉద్యమం సాగింది.

అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా (1975)
దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించిన రోజుల్లో పలు విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థల్లో రహస్య నిరసన ప్రదర్శనలు జరిగేవి. వీటిలో విద్యార్థులే కాకుండా అధ్యాపకులూ పాల్గొనేవారు. ఈ కాలంలో ఉద్యమకారులు కరపత్రాల ద్వారా సమాచారాన్ని ప్రసారం చేసేవారు. జయప్రకాశ్ నారాయణ్‌తో పాటు దాదాపు 300 మంది విద్యార్థి నేతలు ఈ ఉద్యమ కాలంలో జైలుకు వెళ్లారు. అలా వెళ్లిన వారిలో అప్పటి దిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకుడు అరుణ్ జైట్లీ తదితరులు కూడా ఉన్నారు.

**అస్సాం ఉద్యమం**
బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాట్లకు వ్యతిరేకంగా ఈ ఉద్యమం మొదలైంది. 1971నాటి బంగ్లాదేశ్ యుద్ధం అనంతరం తండోపతండాలుగా అస్సాంలోకి వచ్చి చేరిన చొరబాటుదార్లు రాష్ట్ర జనాభా కూర్పులో మార్పులు తేవడంతోపాటు స్థానిక భాషా సంస్కృతులకు ముప్పుగా మారారని పేర్కొంటూ ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు) ఈ ఉద్యమాన్ని ప్రారంభించింది. 1985లో కుదిరిన అస్సాం ఒప్పందంతో ఈ ఉద్యమం ముగిసింది. ఈ ఉద్యమానికి నేతృత్వం వహించిన విద్యార్థి నాయకుడు ప్రఫుల్లకుమార్ మహంత 1985లో రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటికి ఆయన వయసు 35 సంవత్సరాలు.

**రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం (2006)**
కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలతోపాటు ప్రైవేటు విద్యా సంస్థల్లో కూడా ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఈ ఉద్యమానికి నాది పలికింది. ఇందులో భాగంగా విద్యాసంస్థల్లో విస్తృతంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. వీటికి వ్యతిరేకంగా రిజర్వేషన్ అనుకూల వర్గాలు ప్రదర్శనలు నిర్వహించాయి.

నిర్భయ ఉద్యమం (2012)
దిల్లీలో ఒక 23 ఏళ్ల ఫిజియోథెరపీ విద్యార్థినిపై జరిగిన దారుణ సామూహిక అత్యాచారంతో ఈ ఉద్యమం ఆవిష్కృతమైంది. దేశ రాజధానిలో మహిళా సంరక్షణపై ఈ ఉద్యమం అనేక ప్రశ్నలు లేవనెత్తింది. ఈ ఉద్యమ ఫలితంగా నిర్భయ చట్టం 2013 అమలులోకి వచ్చింది.

**జాదవ్‌పూర్ విశ్వ విద్యాలయ ఉద్యమం (2014)**
జాదవ్‌పూర్ విశ్వ విద్యాలయ విద్యార్థులపై జరిగిన పోలీసు దాడి ఉద్యమరూపుదాల్చింది. విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో ఒక విద్యార్థినిపై అత్యాచారం జరిగిందని విద్యార్థులు ఆరోపించారు. న్యాయమైన విచారణ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం చేపట్టారు. దాదాపు 100 మంది విద్యార్థులు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పట్టాలు స్వీకరించేందుకు నిరాకరించారు. వైస్ ఛాన్సలర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

**మండల్ వ్యతిరేక ఉద్యమం**
మండల్ కమిషన్ సిఫార్సులను ఆమోదించిన వీపీసింగ్ సంకీర్ణ ప్రభుత్వం 1990లో ప్రభుత్వోద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఈ ఉద్యమానికి దారితీసింది. దీనిపై దిల్లీ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైన నిరసనోద్యమం క్రమంగా ఇతర విద్యా సంస్థలనూ కుదిపేసింది. దేశంలో పలుచోట్ల నిరసన ప్రదర్శనలు హింసాత్మకమయ్యాయి. 1990, నవంబరు 7న భాజపా మద్దతు ఉపసంహరించడంతో అప్పటి వీపీసింగ్ ప్రభుత్వం కూలిపోయింది. దీంతో మండల్ వ్యతిరేక ఉద్యమం సద్దుమణిగింది.

# ఎన్నింటినో నెగ్గారు.. అలా 'పరీక్ష' తప్పారు



**ఏదైనా రాష్ట్రంలో భాజపాను గట్టెక్కించాలంటే అధిష్ఠానానికి మొదట స్ఫురించే వ్యక్తి ధర్మేంద్ర ప్రధాన్! కీలక మంత్రిత్వశాఖలను చక్కబెట్టాలంటే వినిపించే పేరు అదే!! అలాంటిది 'జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష' (నీట్) పత్రం లీక్ కావడం చివరకు ఆయన మెడకు చుట్టుకుంది. 2024లోనూ నీట్, యూజీసీ-నెట్ (జాతీయ అర్హత పరీక్ష) ప్రశ్నపత్రాల లీకేజీ తర్వాత ఆయన వివాదాల్లో పడినా పదవికి ఎసరు వచ్చేంత సెగ తగల్లేదు. ఈసారి ప్రభుత్వం ఎన్ని హామీలిచ్చినా ఆయన గద్దె నుంచి వైదొలగితేనే తాము దీక్ష విరమిస్తామని విద్యార్థులు విస్పష్టంగా తెగేసి చెప్పడంతో ఆయన ప్రస్థానంలో ఒక్కసారిగా కుదుపు చోటుచేసుకుంది. చివరకు వైదొలగాల్సి వచ్చింది.**

**జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) అమలులో ప్రభుత్వం తరపున కీలక పాత్ర పోషించిన ధర్మేంద్ర ప్రధాన్ 1969 జూన్ 26న ఒడిశాలోని తాల్చేర్‌లో జన్మించారు. ఉత్కళ్ విశ్వవిద్యాలయం నుంచి ఆంథ్రోపాలజీలో పీజీ చేశారు. 1983లో అఖిలభారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నుంచి విద్యార్థి రాజకీయాలు ప్రారంభించారు. 2000లో ఒడిశాలోని పల్లాల్‌హరా నుంచి తొలిసారి శాసనసభకు పోటీచేసి విజయం సాధించారు. 2004లో దేవ్‌గఢ్ లోక్‌సభ స్థానం నుంచి దిగువ సభకు ఎన్నికయ్యారు. 2004-06 మధ్య భాజపా యువమోర్చా అధ్యక్షుడిగా పనిచేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగానూ సేవలందించారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత ప్రత్యక్ష ఎన్నికల పోరుకు దూరంగా ఉన్నా, 2010లో పార్టీకి ప్రధాన కార్యదర్శి అయ్యారు. 2012లో బిహార్ నుంచి, 2018లో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2024లో ఒడిశాలోని సంబల్‌పుర్ నుంచి మరోసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2014 మే 26 నుంచి కేంద్ర పెట్రోలియంశాఖ సహాయ మంత్రిగా, పునర్వ్యవస్థీకరణలో 2017 నుంచి అదే శాఖకు క్యాబినెట్ మంత్రిగా పని చేశారు. మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చాక ఆయనకు పెట్రోలియంశాఖ లభించింది. కొన్నాళ్లపాటు ఉక్కుశాఖ, నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖ బాధ్యతలూ నిర్వర్తించారు. 2021 జులై 7 నుంచి శనివారం వరకు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఉన్నారు.**

**బిహార్, హరియాణా, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల ఎన్నికల బాధ్యుడిగా ధర్మేంద్ర వ్యవహరించారు. 2021లో పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్ ఎన్నికల పోరును ఆయనే పర్యవేక్షించారు. ఆ ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడ ఓడిన విషయం తెలిసిందే. ఒడిశాలో మొదటిసారిగా 2024లో భాజపా ప్రభుత్వం ఏర్పాటు కావడం వెనుక ప్రధాన్ కీలక పాత్ర పోషించారు.**

# ప్రధాన్‌కు.. భాజపా మహిళా ఎంపీ మద్దతిస్తే.. ఆమె కుమార్తె విద్యార్థులకు జైకొట్టింది!



కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల ఆందోళనలకు ముగింపు పడినప్పటికీ.. ఇందుకు సంబంధించి సోషల్ మీడియాలో చర్చ కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో ఒడిశాకు చెందిన భాజపా ఎంపీ అపరాజితా సారంగి కుమార్తె అర్చితా సచిన్ రహర్ మాత్రం ప్రధాన్ రాజీనామాతో సంబరాలు చేసుకోవడం గమనార్హం. తన కుటుంబం ధర్మేంద్ర ప్రధాన్‌కు అండగా ఉంటే.. తన మద్దతు మాత్రం విద్యార్థులకేనంటూ ఆమె పెట్టిన పోస్టులు వైరల్‌గా మారాయి. అయితే, కొన్ని గంటల్లోనే ఆమె సోషల్ మీడియా ఖాతాలు కనిపించకుండా పోవడం గమనార్హం.
నీట్ పేపర్ లీక్‌పై విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనలతో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారంటూ అర్చితా పోస్టు చేయడం కాషాయ పార్టీ నేతల్లో అసంతృప్తికి కారణమైంది. దీనిపై ప్రధాన్ కార్యాలయం నుంచి ఓ విజ్ఞప్తి వచ్చిందని, దీంతో ఆ పోస్టును తొలగించాలని ఎంపీ తన కుమార్తెను కోరినట్లు సమాచారం. అయితే, అర్చితా మాత్రం అందుకు నిరాకరించినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని చెబుతూ మరో పోస్టు చేసిన ఎంపీ కుమార్తె.. ఎట్టిపరిస్థితుల్లో దానిని తొలగించనని స్పష్టం చేశారు.
ఈ పరిణామాల నేపథ్యంలోనే ఎంపీ అపరాజిత స్పందిస్తూ.. నైతిక బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం గొప్ప విషయమని, అత్యంత క్లిష్ట సమయంలో ఆయనకు అండగా నిలుస్తానని పేర్కొంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. సొంత అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించే హక్కు ప్రతిఒక్కరికీ ఉంటుందని, జెన్ జీ తరానికి చెందిన అర్చితకు తన మనసులో మాట చెప్పే హక్కు ఉందని ఎంపీ ప్రతినిధి ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. ఇదిలాఉంటే, అంతకుముందు అస్సాం మంత్రి కేశవ్ మహంతా కుమార్తె దిల్లీలో జరిగిన విద్యార్థి ఆందోళనల్లో పాల్గొనడం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.

# నియంతృత్వ ధోరణితో ఏమీ సాధించలేం: అన్నాహజారే



కేంద్ర విద్యాశాఖ మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పై సామాజిక కార్యకర్త అన్నాహజారే స్పందించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో సమస్యలను పరిష్కరించడానికి చర్చలు మాత్రమే సరైన మార్గమని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు సృష్టించడం.. నియంతృత్వ ధోరణితో ఏమీ సాధించలేమన్నారు. ఇప్పటి వరకు తాను 22సార్లు నిరాహార దీక్ష చేశానని.. ఎన్నడూ హింసను ఆశ్రయించలేదన్నారు. శాంతియుత ఆందోళనలే శాసనపరమైన మార్పులు తీసుకురావడానికి దోహదపడ్డాయన్నారు. తాను చేపట్టిన శాంతియుత నిరసనల కారణంగా.. 10 చట్టాలు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వాలు పౌరుల మాట వినాలని.. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని హజారే సూచించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రెండు అడుగులు ముందుకు వేయాల్సి వచ్చినా.. అందులో ఏ తప్పూ ఉండబోదని పేర్కొన్నారు. మన నిర్ణయాలు ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా ఉండటమే ముఖ్యమన్నారు. మంత్రుల రాజీనామా వంటి డిమాండ్లను సైతం శాంతియుత పద్ధతిలో సాధించుకోవాలని తెలిపారు. హింసాత్మక నిరసనల కంటే శాంతియుత నిరసనలు, చర్చలే ప్రజల్లో, పాలనలో మార్పు తీసుకువస్తాయన్నారు. ఎంతటి పరిస్థితులు ఎదురైనా హింసను మాత్రం ఆశ్రయించొద్దని ప్రజలకు, ప్రభుత్వానికి సూచించారు.

# నల్ల సముద్ర ఓడరేవుల్లో పనికి వెళ్లే ముందు జాగ్రత్తలు తీసుకోండి:



**- కేంద్రం అడ్వైజరీ**

అంతర్జాతీయ వాణిజ్యనౌకల్లో పనిచేసే భారత నావికులకు కేంద్ర విదేశాంగ శాఖ అడ్వైజరీ జారీ చేసింది. నల్ల సముద్ర ప్రాంతంలో పనిచేస్తున్న లేదా దాని ద్వారా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలలో ఉద్యోగాలకు అంగీకరించే ముందు పలు జాగ్రతలు తీసుకోవాలని సూచించింది. ఈ సముద్ర మార్గంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని పేర్కొంది. వాణిజ్య నౌకలపై తరచూ క్షిపణి.. డ్రోన్ దాడులు జరుగుతున్నాయని తెలిపింది. తాజాగా ఉక్రెయిన్‌లోని ఒడెసా తీరంలో భారత నావికులతో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకపై దాడి నేపథ్యంలో ఈ హెచ్చరికలు చేసింది. ఈ దాడిలో ఇద్దరు భారతీయులు గల్లంతయినట్టు సమాచారం. మరో ఇద్దరు భారతీయులు క్షేమంగా ఉన్నట్టు తెలుస్తోంది.
నల్లసముద్ర మార్గాల్లో దాడుల వల్ల ఏప్రిల్ 2026 నుంచి ఇప్పటికే ఐదుగురు భారత పౌరులు ప్రాణాలు కోల్పోయారని విదేశాంగ శాఖ వెల్లడించింది. నల్ల సముద్రం.. దానిని ఆనుకుని ఉన్న ఓడరేవుల్లో విధులను అంగీకరించే ముందు ప్రమాదాలను జాగ్రత్తగా అంచనా వేయాలని నావికుల కు సూచించింది. నౌకామార్గాలు, భద్రతా ఏర్పాట్లు, బీమా సౌకర్యం, అత్యవసర విధానాలు, ఉద్యోగ నిబంధనలను సరిచూసుకోవాలని పేర్కొంది. ప్రయాణ వివరాలను ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ..వారితో సంప్రదింపులు జరపాలని కోరింది. సముద్రయాన అధికారులు జారీ చేసిన భద్రతా మార్గదర్శకాలను పాటించాలని కోరింది. అంతర్జాతీయ సముద్ర జలాల్లో ఉన్న సమయంలో ఏదైనా సహాయం అవసరమైతే అత్యవసర నంబర్ల ద్వారా ఆ ప్రాంతంలోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరపాలని పేర్కొంది.




# ఆధునిక అరబ్ నిర్మాణ దక్షుడు

దేశ ప్రతిష్ఠను పెంపొందించడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి నిర్మాణాత్మక చర్యలతో ముందుకు వెళ్లడమే మానవీయ రాజధర్మమని నిరూపించిన అతి అరుదైన పాలకులలో, ఈ నెల 12న 74 ఏళ్ల వయసులో మరణించిన ఖతర్ మాజీ రాజు షేక్ హామద్ తానీ ఒకరు. అతి చిన్న ఎడారి రాజ్యమైన ఖతర్‌ను అగ్రగామి ఆధునిక దేశంగా రూపొందించేందుకు సంకల్పించి, ఆ సమున్నత లక్ష్యాన్ని అనతి కాలంలో సాధించిన రాజ్య నిర్మాణ దక్షుడు హామద్ తానీ. భారత్ తన జాతీయ పతాకాన్ని సగం వరకు అవనతం చేసి ఆయన మృతికి సంతాపాన్ని ప్రకటించింది. హామద్ అంత్యక్రియలలో సమస్త దేశాల అధికారిక ప్రతినిధి బృందాలు పాల్గొనడం అంతర్జాతీయ వ్యవహారాలలో ఖతర్ ప్రాధాన్యానికి తార్కాణం.

జనాభాపరంగా తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ జిల్లా కంటే చిన్నదైన ఖతర్ ప్రపంచ పటంలో ప్రముఖంగా ఎదగడానికి హామద్ దూరదృష్టి, దీక్షా దక్షతలే ప్రధాన కారణం. ఖతర్ పాలనా బాధ్యతలు చేపట్టినది మొదలు అనేక విప్లవాత్మక నిర్ణయాలతో ఆ దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించారు. హామద్ అనుసరించిన విధానాలతో భారతీయులకూ ఖతర్‌లో పెద్ద సంఖ్యలో ఉపాధి లభించింది. ఇరుగు పొరుగు దేశాలు చమురు ఎగుమతులతో అపార సిరిసంపదలకు నెలవులు కాగా హామద్ తన దేశంలోని గ్యాస్ నిక్షేపాలపై దృష్టి పెట్టి వాటి ఆధారంగా ప్రపంచ ఇంధన విపణిలో ఖతర్‌కు అద్వితీయ స్థానాన్ని సాధించారు. సహజ వాయువు ఎగుమతులతో సమకూరిన ఆదాయంతో ఖతర్ వాసుల జీవన ప్రమాణాలను ఇతోధికంగా మెరుగుపరిచారు. అమెరికా, ఐరోపా వాసుల కంటే ఖతర్ అరబ్బుల జీవన స్థితిగతులే అన్ని విధాలా సుఖసంతోషాలతో ఉండేందుకు హామద్ పాటుపడ్డారు. సత్ఫలితాలు సాధించారు. నేడు అపూర్వ భాగ్యసీమగా ఖతర్ విలసిల్లుతోంది.

అరబ్ రాచరిక పాలకులు సాధారణంగా సుదీర్ఘకాలం లేదా జీవిత పర్యంతం అధికారంలో కొనసాగడం పరిపాటి. హామద్ అలా కాకుండా స్వల్పకాలం మాత్రమే పాలనా బాధ్యతల్లో ఉన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న తన తండ్రిని పదవీచ్యుతుడిని చేసి సింహాసనమెక్కిన షేక్ హామద్.. 18 ఏళ్ల పాటు (1995–2013) పరిపాలించి, కుమారుడు షేక్ తమీంకు రాజుగా పట్టాభిషేకం చేసి విశ్రాంత జీవితంలోకి వెళ్లారు.

ఖతర్‌కు రాజకీయంగా ఎనలేని ప్రాధాన్యాన్ని సంతరింపజేయడంతో పాటు హామద్ తన దేశాన్ని ఒక సైనిక శక్తిగా తీర్చిదిద్దారు. మీడియా జగత్తులోను తన దేశం ఒక సముచిత స్థానంలో ఉండాలని భావించి, ఆయన ఆ దిశగా అడుగులు ముందుకు వేసి అద్భుతాలు సాధించారు. అల్ జజీరా... అరబ్బు ప్రపంచాన్ని సమూలంగా మార్చిన టెలివిజన్ ప్రసార చానెల్‌ను నెలకొల్పడమే ఆ దిశగా ఒక విప్లవాత్మక ముందడుగు. వివిధ కారణాల వలన సమాచార మాధ్యమాలపై ఆంక్షలు అమలులో ఉండే అరబ్బు ప్రపంచంలో అల్ జజీరా ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది. వార్త, వ్యాఖ్య, విశ్లేషణలో నిష్ణాతులయిన పాత్రికేయుల సమూహంగా ఆవిర్భవించిన ఈ చానెల్ ఖతర్‌కు ఒక విలక్షణ గుర్తింపును తీసుకువచ్చింది. ఇరాక్, సూడాన్, అఫ్ఘానిస్థాన్, పాలస్తీనా ఆక్రమిత ప్రాంతాలలో దాడులు చేసేందుకు అమెరికా, దాని మిత్ర దేశాలు వెనుకంజ వేసేవి అంటే ఈ చానెల్ కవరేజీనే కారణమని నిస్సంకోచంగా చెప్పవచ్చు. అల్ జజీరా ప్రజాదరణకు అదొక తిరుగులేని తార్కాణం. ట్యూనీసియాలో సంభవించిన ఒక సంఘటనపై అల్ జజీరాలో ప్రసారమైన ఒక వార్త అరబ్ దేశాలలో జాస్మిన్ విప్లవానికి దారితీసింది. యావత్తు ప్రపంచాన్ని కవరేజీ చేసిన ఈ చానెల్‌కు వ్యవస్థాపకుడు అయిన హామద్ ఒక్కసారి కూడా ఇంటర్వ్యూ ఇవ్వకపోవడం ఆసక్తికరం.

ఆదాయంతో పాటు జాతీయ భద్రత కూడా అనివార్యమని భావించిన హామద్ తన దేశంలో ఒక భారీ సైనిక స్థావరాన్ని నిర్మించి అమెరికాకు అప్పగించారు. అమెరికా అందులో నిర్వహిస్తున్న సైనిక నియంత్రణా కేంద్రం ప్రపంచంలోని అతిపెద్ద సైనిక స్థావరాలలో ఒకటి. ఒకవైపు ఇజ్రాయెల్ మరోవైపు పాలస్తీనా, ఒకవైపు అమెరికా మరోవైపు తాలిబన్లతో ఏకకాలంలో సాన్నిహిత్యాన్ని కలిగివుండడం ద్వారా ఖతర్ దౌత్యపరంగా తనకంటూ ఒక విశ్వసనీయమైన స్థానాన్ని సంపాదించింది. భారత్–తాలిబన్ల మైత్రి కూడా ఖతర్‌లో మొదలయింది. క్రీడారంగంలో ఏ విధమైన అనుభవం లేకున్నా ప్రపంచ ఫుట్‌బాల్ కప్ పోటీల ఆతిథ్యానికి ముందుకు వచ్చి, ప్రశస్తంగా నిర్వహించి ప్రపంచాన్ని అబ్బురపరచిన దేశం ఖతర్. ఆ దేశంలోని అత్యాధునిక హామద్ అంతర్జాతీయ విమానాశ్రయం భారత్, ఇతర ఆసియా దేశాల నుంచి ఉత్తర అమెరికా, ఐరోపా ఖండాలకు రాకపోకలు సాగించే మార్గంలో కీలక అనుసంధాన కేంద్రంగా ఉన్నది. అనతికాలంలో ప్రపంచంలోని అత్యున్నత విమానయాన సంస్థలలో ఒకటిగా ఎదిగిన ఖతర్ ఏయిర్‌వేస్ కార్యకలాపాలకు ఆ విమానాశ్రయమే కేంద్రంగా ఉన్నది. మన ఎయిర్ ఇండియాకు ఉన్న విమానాల కంటే ఖతర్ ఎయిర్‌వేస్‌కు ఉన్న విమానాలే ఎక్కువ. ఖతర్‌ను ఆధునికంగా తీర్చిదిద్ది, జాతి సంపదను ప్రజా శ్రేయస్సుకు, విశాల ప్రపంచ పురోగతికి వినియోగించడంలో తనకు తానే సాటి అని నిరూపించిన షేక్ హామద్ నిత్య స్మరణీయుడు.



# పీవోకేలో పాక్ దమనకాండ

**పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో మరోసారి నిరసనల అగ్గి రాజుకుంది. దశాబ్దాలుగా స్థానిక వనరులను దోచుకుంటూ, అభివృద్ధి విషయంలో మాత్రం పాకిస్థాన్ తమను పూర్తిగా విస్మరిస్తుండటంపై పీవోకే ప్రజల్లో ఆగ్రహ జ్వాలలు పెల్లుబుకుతున్నాయి. అణచివేతకు తెరదించి, పరిపాలనా వ్యవహారాల్లో తమకు నిజమైన స్వేచ్ఛనివ్వాలని వారు ఉద్యమిస్తున్నారు. పీవోకేను స్వతంత్ర కశ్మీర్‌గా పాక్ పేర్కొంటున్నా, వాస్తవంలో మాత్రం ఆ స్వాతంత్ర్యం కనిపించదు. ఆ ప్రాంత పరిపాలనా వ్యవహారాల్లో ఇస్లామాబాద్ అతిగా జోక్యం చేసుకుంటూ ఉంటుంది. దాన్ని పరోక్షంగా ఏలేందుకు కుట్రలు పన్నుతుంటుంది. పీవోకే అసెంబ్లీలో మొత్తం 53 స్థానాలున్నాయి. వాటిలో 33 సీట్లకే పీవోకే ప్రజలు తమ నాయకులను నేరుగా ఎన్నుకుంటారు. మిగిలిన స్థానాల్లో ఎనిమిది నామినేటెడ్ సీట్లు. 12 స్థానాలను పాక్‌లో స్థిరపడిన కశ్మీరీ శరణార్థులకు కేటాయించారు. వీటికి పీవోకే ఆవలే ఎన్నికలు జరుగుతాయి. తమ చెప్పుచేతల్లో ఉండే నాయకులను వాటిద్వారా పీవోకే అసెంబ్లీకి పాక్ పంపిస్తోందని, నామినేటెడ్ పోస్టులతోనూ అనుచిత లబ్ధి పొందుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేరుకు తమకు సొంత అధ్యక్షుడు, ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు, అసెంబ్లీ ఉన్నా.. పాలన మొత్తం ఇస్లామాబాద్ కనుసన్నల్లోనే సాగుతోందని వారు వాపోతున్నారు. జులై 27న అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో కశ్మీరీ శరణార్థులకు కేటాయించిన సీట్లను రద్దుచేయాలన్న ప్రధాన డిమాండ్‌తో పీవోకేలో ఇటీవల మొదలైన ఉద్యమం క్రమంగా ఉద్ధృత రూపం దాల్చింది.**



### అభివృద్ధిపై శీతకన్ను

సాంకేతికంగా చూస్తే పీవోకే అసలు పాక్‌లో భాగమే కాదు. పాక్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 ఆ దేశ ప్రావిన్సులను తెలుపుతుంది. అందులో పీవోకే పేరే లేదు. కాబట్టి పాక్ జాతీయ పార్లమెంటులో పీవోకేకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. అడవులు, గ్రాఫైట్, మార్బుల్, రత్నాల వంటి అపార వనరులు ఉన్నా అభివృద్ధికి మాత్రం పీవోకే నోచుకోలేకపోతోంది. ఇక్కడి వనరులను ఇస్లామాబాద్ ఆదినుంచీ దోచుకుంటోంది. పంజాబ్, సింధ్ ప్రావిన్సుల్లో సాగునీటికి పీవోకే గుండా ప్రవహించే సింధూ నదీ వ్యవస్థే కీలకం. పాక్‌కు కావాల్సిన మొత్తం విద్యుదుత్పత్తిలో 1015 శాతాన్ని ఇక్కడి హైడ్రోపవర్ ప్రాజెక్టులే ఉత్పత్తి చేస్తున్నాయి. అయినా పాక్ ఈ ప్రాంత అభివృద్ధిపై శీతకన్ను వేస్తోంది. పీవోకేలో సముచిత స్థాయిలో మౌలిక వసతులు కల్పించడం లేదు. అక్కడి జనాభాలో దాదాపు 66శాతం మందికి వ్యవసాయం, పశుపోషణే ప్రధాన జీవనాధారం. సాగురంగంలో అనిశ్చితి వల్ల 57.1శాతం మందికి ఆహార భద్రత కొరవడింది. 29శాతం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. పాక్ జాతీయ సగటు(19.9శాతం)తో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. పీవోకేలో అయిదేళ్లలోపు చిన్నారుల్లో 39శాతం మందిలో ఎదుగుదల సరిగ్గా లేదు. మాతామరణాల రేటూ ఎక్కువే. పీవోకే ప్రజల ప్రాణాలకు రక్షణా అంతంతమాత్రంగానే ఉంది. పాక్ కేంద్ర బలగాలు ఇక్కడి ప్రజలపై తరచూ ఉక్కుపాదం మోపుతుంటాయి. పీవోకేలో పాక్ దమనకాండకు తాజా ఉద్యమాన్నే ఉదాహరణగా చెప్పవచ్చు. ఇప్పటికే 100 మందికిపైగా నిరసనకారులను పాక్ కేంద్ర బలగాలు బలిగొన్నాయి. 600 మందికిపైగా ఉద్యమకారులను అరెస్టు చేశాయి.

### ఎంతవరకు పోరాడగలరు?

పీవోకేలో ప్రస్తుతం ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమానికి జమ్మూకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) నేతృత్వం వహిస్తోంది. కశ్మీరీ శరణార్థుల సీట్లను రద్దు చేయడం సహా మొత్తం 38 డిమాండ్లను అది ఇస్లామాబాద్ ముందుంచింది. విద్యుత్ టారిఫ్‌లను తగ్గించడం, నిత్యావసరాలకు రాయితీలివ్వడం, స్థానిక వనరులతో సమకూరే ఆదాయంలో సముచిత వాటా కల్పించడం, తమపై పాక్ ప్రధాని నేతృత్వంలోని కశ్మీర్ మండలి నియంత్రణను తగ్గించడం, స్థానిక అసెంబ్లీ అధికారాలను పెంచడం వంటివి అందులో ఉన్నాయి. ఈ డిమాండ్ల సాధనకు జేఏఏసీ అల్టిమేటం విధించినా ఖాతరు చేయని ఇస్లామాబాద్ తనకు బాగా అలవాటైన అణచివేత ధోరణితోనే మరోసారి ముందుకెళ్తోంది. పీవోకేకు ఆహారం, ఇంధనం, ఔషధాల సరఫరాను అడ్డుకుంటోంది. ఇప్పటికే ఆ ప్రాంతంలో పలు ఫిల్లింగ్ స్టేషన్లు మూతపడ్డాయి. ఔషధాల్లేక జనం అల్లాడుతున్నారు. నిషేధాలు, అరెస్టులు, బాష్పవాయు ప్రయోగం, కాల్పులు.. ఇలా అన్ని అణచివేత అస్త్రాలను పాక్ ప్రయోగిస్తోంది. అయినప్పటికీ తమ డిమాండ్ల విషయంలో పీవోకే ప్రజలు పట్టు వీడటం లేదు. తమను ఆర్థికంగా, రాజకీయంగా కుదేలు చేస్తూ బలప్రయోగానికి పాల్పడుతున్న ఇస్లామాబాద్‌తో తెగదెంపులు చేసుకోవాలని వారిలో అత్యధికులు కోరుకుంటున్నారు. కానీ, నిత్యావసరాల సరఫరానూ అడ్డుకుంటూ పీవోకేలో మానవతా సంక్షోభం తరహా పరిస్థితులను సృష్టిస్తున్న పాక్ కుట్రలను దాటుకుని వారు ఎంతవరకు పోరాటం కొనసాగించగలరన్నది ప్రశ్నార్థకమే. అయితే బలూచిస్థాన్‌లో బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) తన కార్యకలాపాలను విస్తృతం చేస్తుండటంతో ఇప్పటికే గుటకలు మింగుతున్న పాక్.. పీవోకేలో ఉద్యమంతో మరింత ఇరుకున పడుతుందనడంలో సందేహం లేదు!

# ఉమ్మడి పౌర ప్రవర్తన

**'ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకూ, పూలిమ్మనీ రెమ్మరెమ్మకూ; ఎంత తొందరలే హరి పూజకు, పొద్దుపొడవకముందె పూలిమ్మనీ'– అంటూ ఆశ్చర్యపోతారు దేవులపల్లి కృష్ణ శాస్త్రి ఓ సినీగీతంలో! నిజమే, పూలిమ్మని రెమ్మరెమ్మనూ ఎవరు శాసించారు, ఏ చట్టం కొట్టి చెప్పింది? సృష్టిలోని సకలజీవులూ ఒకరికొకరు సహకరించుకుంటూ, ఒకరినొకరు గౌరవించుకుంటూ ఉమ్మడిగా సుఖజీవనం సాగించడానికి ప్రకృతి చేసిన ఏర్పాట్లలో ఒకటి కదా అది! పట్టిచూస్తే తప్ప అర్థం కాని, మన అవగాహనకు అందని ప్రకృతి విశాల ప్రణాళికలో అది భాగం కదా! బుర్రలేదనుకునే పక్షీ, పశువూ, చెట్టూ, పుట్టా, రాయీ, రప్పా సైతం ప్రాకృతిక న్యాయంలో భాగమైనప్పుడు బుర్ర ఉందనుకునే మనిషి ఎందుకు కాడు?! సంస్కృతీ, నాగరికతా మార్గంలో వేల సంవత్సరాల ప్రస్థానం తర్వాత, ఇప్పటికైనా అయ్యాడా? అందులో ప్రకృతి ప్రణాళికకు పెడగా పడిన అడుగులెన్ని!జీవం మనిషిగా ఎదిగిన మొదట్లో చట్టాలు లేవు; మనుగడలో భాగంగా సాటి మనిషితో జతకట్టాడు, గుంపుగా ఎదిగాడు, అనేక గుంపులతో కలసి సామరస్యంగా సహజీవనం చేసే స్థాయికి చేరాడు. తన అస్తిత్వంలో ఎక్కువకాలం అలిఖిత శాసనాలే**




**మనిషిని నడిపించాయి; మంచీ, మర్యాదా మప్పాయి; నీతీ, రీతీ నేర్పాయి; సభ్యత, శుభ్రత అలవరచాయి. అయినా ఇప్పటికీ ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. అవినీతి, అసభ్యత, అక్రమాల అధఃపాతాళపు లోతులు చూస్తూనే ఉన్నాడు. ప్రకృతిమార్గం నుంచి తప్పుకుని సృష్టికి ప్రతిసృష్టి చేసే ప్రావీణ్యం విర్రవీగడమే అందుకు కారణమా?!**

మానవ జనావాసాలు గుంపు దశనుంచి నగరాలుగా ఎదిగే క్రమంలో లిఖిత శాసనాలు వచ్చాయి. అయిదు వేల సంవత్సరాల క్రితం ప్రాచీన సుమేరు నాగరికతా కాలంలో తెచ్చిన 'ఉర్-నమ్ము' అనే శిక్షాస్మృతిని తొలి స్మృతిగా చెబుతారు. ఆ తర్వాత క్రీ.పూ. 1750లో, బాబిలోనియా పాలకుడు హమ్మురాబి పేరిట శిక్షాస్మృతి వచ్చింది. ఆ తర్వాత క్రీ.పూ. 451లో 'లా ఆఫ్ ట్వెల్వ్ టేబుల్స్' పేరిట రోమన్ చట్టాలు వచ్చాయి. వాటిని క్రోడీకరిస్తూ క్రీ.శ. 529లో జెస్టీనియన్ శిక్షాస్మృతిని తెచ్చారు. ఆధునిక పౌరచట్టాలనూ, వ్యవస్థలనూ అదే ప్రభావితం చేసిందంటారు. మన దగ్గర క్రీ.పూ. 400లో అర్థశాస్త్రం, ఆ తర్వాత మను□స్మృతితో సహా వివిధ స్మృతులు వచ్చి మానవ ప్రవర్తనను కట్టడి చేయడానికి ప్రయత్నించాయి.

కులమతవర్గ భేదాలను దాటుకుంటూ ప్రజాస్వామ్యం దిశగా అడుగువేస్తున్న వర్తమానంలో ఈ ప్రాచీన స్మృతులు మంచి-చెడుల కలబోతగా కనిపించ డంలో ఆశ్చర్యం లేదు. క్రీస్తుశక ప్రారంభంలో మౌర్యచక్రవర్తి అశోకుడు 'ధర్మస్తంభా'ల పేరిట దేశమంతటా స్థాపించిన లిఖిత శిలాస్తంభాలు జంతుబలుల నిషేధంతో సహా ఆయా విధినిషేధాలను శాసిస్తూనే; సత్కార్యాలను, దయను, దాతృత్వాన్ని, సత్యనిష్ఠను, పరిశుద్ధతను బోధించాయి; క్రౌర్యాన్ని, కోపాన్ని, గర్వాన్ని విడిచిపెట్టమనీ; అన్ని మతా లను, పంథాలను గౌరవించమనీ చెప్పాయి.

మనిషి ప్రవర్తనను చట్టాలూ, శిక్షలతోనే కాదు; తగిన హితబోధతో మానసిక పరివర్తన ద్వారా కూడా కట్టడి చేసే ప్రయత్నం ముందునుంచీ జమిలిగా సాగింది. ప్రభుత్వాలు చట్టాలు, శిక్షలతో చేయబోయిందే - వేదాలూ, కావ్యేతిహాసాలు సహా ప్రపంచ వాఙ్మయమంతా హితబోధతో చేయబోయింది. అందుకే ప్రత్యేకించి కావ్యాలను కాంతాసమ్మితాలన్నారు. 'భగవంతుడు ఆకలిచావును విధించలేదు, తిండి ఉన్నవాడు కూడా చావక తప్పదు; తనకున్నదాన్ని ఇతరులతో పంచుకునేవాడు ఎప్పటికీ అణ గారడు; దాతృత్వం లేనివాడు ఒంటరి అయిపోతా'డంటుంది ఋగ్వేదం. దయ, ధర్మం లేని కొంప కొంపే కాదంటుంది.

విజ్ఞతా, వినయాలే తప్ప అహంకారం, ధిక్కారం పని చేయవని మహాభారతంలోని యక్షప్రశ్నల ఘట్టం చెబుతుంది. ఒక యక్షుడికి చెందిన చెరువులో నీళ్ళు తాగబోయి, అతని ప్రశ్నలకు జవాబు చెప్పడానికి నిరాకరించి, ధిక్కరించి తన నలుగురు సోదరులూ స్పృహ కోల్పోయినప్పుడు ధర్మరాజు వినమ్రంగా జవాబు చెప్పి సోదరులను బతికించుకుంటాడు. కనుక చట్టాలకూ, హితబోధకూ మధ్య సమతూకం తప్పనిసరి. ఏది ఎక్కువైనా సత్ప్రవర్తన గల్లంతవుతుంది. చట్టాలే సర్వస్వ మనుకుంటే వాటి ఉల్లంఘనా సర్వసామాన్యమవుతుంది. ఉమ్మడి పౌరస్మృతులతో పాటు హిత మార్గంలో ఉమ్మడి పౌర ప్రవర్తనను తీర్చిదిద్దడమూ అంతే అవసరం.

# 'లివ్ ఇన్'పై సమగ్ర చట్టం అవసరం

నేటి 'జెన్ జీ' యువతరం 'లివ్ ఇన్ రిలేషన్'లో ఉండడానికి ఇష్టపడుతున్నది. పెళ్లి వలన ఏర్పడే బాధ్యతలు, బంధాలు ఇవేమీ లేకుండా, ఇష్టమైనంత కాలం కలసి ఉండి, ఏ చట్టపరమైన అడ్డంకులు లేకుండా ఎప్పుడైనా విడిపోగలగడమే ఈ 'లివ్ ఇన్ రిలేషన్' ప్రత్యేకత. మేజర్ అయిన వారు ఇష్టానుసారం, ఎవరినైనా పెళ్లి చేసుకునే హక్కు, లేదా ఎవరితోనైనా కలిసి ఉండే హక్కు ఉందనీ, అనైతికంగా అనిపించినా అది నేరం కాదనీ 2006లోనే 'లతా సింగ్ వర్సెస్ ఉత్తరప్రదేశ్' ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మరింత లోతుగా విశ్లేషిస్తూ, ఇదే అభిప్రాయాన్ని మరింత దృఢంగా, మరింత స్పష్టంగా సుప్రీంకోర్టు 'ఖుష్బూ వర్సెస్ కన్నియమ్మాల్' కేసులో వెల్లడించింది. 'ఇద్దరు వ్యక్తులు పెళ్లిని పోలిన సంబంధంలో కలిసి ఒకే గృహంలో నివసిస్తూ, అందులో ఒకరు గృహహింసకు గురైనప్పుడు ఫిర్యాదు చేయవచ్చ'ని పేర్కొంటూ 'గృహహింస చట్టం-2005' కూడా 'లివ్ ఇన్ రిలేషన్'ను గుర్తించిందని వర్ష కపూర్ కేసులో ఢిల్లీ హైకోర్టు తెలిపింది. ఇందిరాశర్మ కేసులో అన్ని సంబంధాలు 'లివ్ ఇన్ రిలేషన్' కాలేవని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసులో.. ఈ విషయం తెలిసి కూడా ఆమె పెళ్లై పిల్లలు ఉన్న వ్యక్తితో 18 ఏళ్లు కలిసి జీవించింది. ఆ తరువాత, అతను ఆమె నుంచి దూరమవ్వడంతో, మెయింటెనెన్స్ కావాలని గృహహింస చట్టం కింద కేసు వేసింది. ఇటువంటి సంబంధాలు 'లివ్ ఇన్ రిలేషన్' కోవలోకి రావని చెప్తూ, పార్లమెంటు దీనిపై చట్టం చేయాల్సిన ఆవశ్యకతను గుర్తు చేసింది. మరి 'లివ్ ఇన్ రిలేషన్'లో పిల్లలు పుడితే? ఒకప్పుడు పెళ్లి కాకుండా పుట్టిన పిల్లలను అక్రమ సంతానంగా



పరిగణించేవారు. అయితే, చట్ట విరుద్ధ వివాహంలో కన్న సంతానాన్నీ సక్రమంగానే పరిగణించాలని, తల్లిదండ్రుల ఆస్తుల్లో వారికి వాటా కూడా లభిస్తుందని 1976లో హిందూ వివాహ సవరణ ద్వారా చట్టంలో మార్పు చేశారు. అలాగే, 'ఎస్పీఎస్ బాలసుబ్రమణ్యం వర్సెస్ సురుత్తేయన్' కేసులో చాలా కాలం 'లివ్-ఇన్' సంబంధంలో ఉండి పిల్లలు పుడితే వారిని సక్రమ సంతానంగానే పరిగణించాలని, వారికి కూడా తల్లిదండ్రుల ఆస్తుల్లో వాటా లభిస్తుందని సుప్రీంకోర్టు చెప్పింది. అయితే, 'భారతమాత వర్సెస్ విజయా రంగనాథన్' కేసులో పూర్వీకుల ఆస్తిలో వాటా మాత్రం రాదని చెప్పింది.

2018లో.. లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో పుట్టిన పిల్లలకు చట్టబద్ధత కల్పించడానికి చట్టం తీసుకురావాలని ప్రభుత్వానికి లా కమిషన్ సిఫారసు చేసింది. కానీ, పార్లమెంటు ఇంతవరకు దీనిపై చట్టం చేయలేదు. కోర్టులు మాత్రం లివ్ ఇన్ సంబంధాన్ని గుర్తించాయి. అయితే, ఉత్తరాఖండ్ రాష్ట్రం, 2025 నుంచి యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు చేసింది. దీనిలో భాగంగా, లివ్ ఇన్ సంబంధాన్ని నిర్వచించి ఎన్నో కఠిన నియమ నిబంధనలను ఏర్పరచింది. అవి: ఒక 'లివ్ ఇన్' సంబంధంలో ఉన్నప్పుడు మరో 'లివ్ ఇన్' సంబంధంలో ఉండరాదు. కేవలం మేజర్ అయినవారు మాత్రమే లివ్ ఇన్ సంబంధంలో ఉండవచ్చు. కానీ, 21 ఏళ్ల కంటే తక్కువ వయసున్నవారి విషయంలో ఆ వ్యక్తుల తల్లిదండ్రులకు వారి లివ్ ఇన్ సంబంధం గురించి సబ్ రిజిస్ట్రార్ తెలియపరచాలి. లివ్ ఇన్ సంబంధాన్ని మొదలుపెట్టిన 30 రోజుల్లోగా, రిజిస్ట్రేషన్ చేసి, ధ్రువపత్రం పొందాలి. రిజిస్ట్రేషన్ కాగానే, సబ్‌రిజిస్ట్రార్ సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారమందించాలి. అలాగే, లివ్ ఇన్‌కు ఇరువురిలో ఎవరైనా, ఎప్పుడైనా స్వస్తి పలకవచ్చు. లివ్ ఇన్ సంబంధం ముగిసిపోయినప్పుడు కూడా మళ్లీ రిజిస్ట్రార్‌కు సమాచారమివ్వాలి. ఈ నియమాన్ని అతిక్రమిస్తే, మూడు నెలల వరకు జైలు శిక్ష, పదివేల రూపాయల వరకు జరిమానా, లేక ఈ రెండూ విధించవచ్చు. లివ్ ఇన్ పార్ట్‌నర్స్‌కు కొన్ని హక్కులు కూడా కల్పించారు. లివ్ ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళ మెయింటెనెన్స్ భృతి కోసం కోర్టుకు దరఖాస్తు చేయవచ్చు. కాబట్టి, లివ్ ఇన్ సంబంధాలకు చట్టబద్ధత ఉన్నట్టే లెక్క. కానీ ఈ సంబంధాలు పెరిగిపోతున్న నేపథ్యంలో, సుప్రీం కోర్టు సూచించినట్లుగా, త్వరగా ఒక సమగ్ర చట్టం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నది.

## కూటమి పాలనలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో

# సీట్లకు డిమాండ్ ఏర్పడింది



- విద్యా సంస్థల్లో రాజకీయాలు లేకుండా చేసిన నాయకుడు నారా లోకేష్
- కురుగుంట కస్తూర్బా కళాశాల - నూతన భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత
- రూ.1.60కోట్ల నిధులతో జూనియర్ కళాశాల నూతన భవనాల నిర్మాణం
- కస్తూరిబా కళాశాలకు 50వేల విరాళం
- తల్లికి వందనంపై ప్రతి తల్లి సంతోషం వ్యక్తం చేస్తోందన్న సునీత

**రాప్తాడు జూలై 26, అనంత జనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడే పరిస్థితి వచ్చిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని కురుగుంట గ్రామ సమీపంలో కస్తూరీబా గాంధీ బాలికల జూనియర్ కళాశాల నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కళాశాలకు వచ్చిన ఎమ్మెల్యే సునీతకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. 1కోటి 60లక్షల ఏ.డబ్ల్యు.పి నిధులతో నిర్మించిన కళాశాల నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం తరగతి గదులు, టాయిలెట్స్, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ లాబ్ ను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి గ్రూప్ ఫోటో దిగారు. కస్తూర్బా పాఠశాలలో అభివృద్ధి పనులకు 50వేల రూపాయలు విరాళం అందించారు. ఆ తర్వాత కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో 5గురుకుల జూనియర్ కళాశాలల్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. అంతేకాకుండా అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశామని, ఈ కళాశాలల్లో చేరేందుకు విపరీతమైన పోటీ ఉందని అన్నారు. తమ వద్దకు వచ్చి ఫలానా కళాశాల, పాఠశాలలో చేరేందుకు సిఫార్సు చేయమని అడిగే పరిస్థితి వచ్చిందన్నారు. దీనికి ప్రధానమైన కారణం విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ తీసుకొచ్చిన మార్పులు అని అన్నారు. గతంలో పిల్లల చదువుకునే పుస్తకాలు, చివరికి బెల్టుల మీద కూడా జగన్ రెడ్డి బొమ్మ వేసుకున్నాడని విమర్శలు చేశారు. అందుకే అలాంటి వాటికి తావు లేకుండా సర్వేపల్లి రాధాకృష్ణ, డొక్కా సీతమ్మ వంటి గొప్ప వారి పేర్లతో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో కంటే నాణ్యమైన విద్యా కిట్లు అందజేస్తున్నారన్నారు. విద్యా సంస్థల్లో ఎక్కడా రాజకీయాలకు తావు లేకుండా మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకున్నారన్నారు. తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ అందుతోందని ఎమ్మెల్యే సునీత అన్నారు. ఈరోజు ఏ విద్యార్థి ఇంట చూసిన సంతోషం కనిపిస్తోందని ఏ తల్లిని అడిగినా ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రూ.1.70కోట్లతో ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో, రూ.2.50 కోట్లతో కస్తూరీబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. అంతేకాకుండా ప్రతి విద్యా సంస్థలకు సోలార్ ఏర్పాటు చేశారని వేడి నీరు అందుతోందన్నారు. మరోవైపు పాఠశాలల్లో దొడ్డు బియ్యం స్థానంలో నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాలలో కూడా మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇన్ని మంచి కార్యక్రమాలు చేసినప్పుడు విద్యార్థులు కూడా క్రమశిక్షణగా చదువుకొని ఉన్నత స్థానానికి వెళ్లాలని ఎమ్మెల్యే సునీత సూచించారు.



## తెలుగు వైభవాన్ని చాటేలా ప్రతి ఏటా

# 'తెలుగు మహోత్సవం'



- సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో తెలుగు మహోత్సవాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశం
- ఉండవల్లి గుహల వద్ద ఘనంగా ముగిసిన రెండు రోజుల తెలుగు మహోత్సవ వేడుకలు.. ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్

**అమరావతి జూలై 26, అనంత జనశక్తి ప్రతినిధి**

తెలుగు భాషా, సాంస్కృతిక వైభవాలు నలుదిశలా వెలుగొందేలా ఇకపై ప్రతి ఏటా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో 'తెలుగు మహోత్సవం' వేడుకలను నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా ఉండవల్లి గుహల ప్రాంగణంలో రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన "తెలుగు మహోత్సవం" ముగింపు వేడుకలకు మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రాంగణానికి విచ్చేసిన మంత్రివర్యులకు జానపద కళారూపాలు, మంగళవాయిద్యాలతో నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం తెలుగు భాష వ్యాప్తి కోసం కృషి చేసిన పలువురు కవులను, డిజిటల్ మాధ్యమంలో తెలుగు ఉనికి కోసం పోరాడుతున్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లను మంత్రి దుర్గేష్ సన్మానించారు. తెలుగు భాషపై ఉన్న ప్రత్యేక అభిరుచితో తనకు ఎంతో ఇష్టమైన 'విశ్వక్సేనుడు' అనే పదాన్ని మంత్రి దుర్గేష్ స్వయంగా తన దస్తూరితో రాసి భాషాభిమానాన్ని చాటుకున్నారు. మట్టి వాసనలు పరిమళించేలా కుండల తయారీని పరిశీలించారు. కాలిగ్రఫీ ద్వారా తన సంతకాన్ని తెలుగులో రాయడాన్ని ఆసక్తిగా గమనించారు. ప్రాచీన జానపద కళ రూపమైన తోలుబొమ్మలాటను స్వయంగా వీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ స్కూల్‌లో రెండవ తరగతి చదువుతూనే అత్యంత స్పష్టతతో భగవద్గీత శ్లోకాలను పఠించిన ఒక చిన్నారిని మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావు గీసిన ప్రత్యేక ఛాయాచిత్రాన్ని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింహాద్రి వాణి రచించిన కవితా కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా సామెతల చెట్టును ఆసక్తిగా తిలకించారు.

**తెలుగు భాషా పరిరక్షణ, సాంస్కృతిక వైభవ పునరుద్ధరణే కూటమి ప్రభుత్వ లక్ష్యం: పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్**

మాతృభాషతోనే విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధి తెలుగు భాషను ప్రపంచ శిఖరాగ్రాన నిలబెట్టాలనే ఉన్నతమైన ఉద్దేశంతోనే చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఉండవల్లి గుహల వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో తెలుగును విరివిగా ఉపయోగిస్తూ, భావితరాలకు దీనిని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆంగ్ల భాషా పరిజ్ఞానం నేటి అవసరమే అయినప్పటికీ, మాతృభాషను ఏమాత్రం విస్మరించకూడదని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక స్థాయిలో బోధన మాతృభాషలోనే సాగినప్పుడు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా దృక్పథం పెరుగుతాయని, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రాధాన్యతను గుర్తించే సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్యలో తెలుగు భాషను తప్పనిసరి చేసిందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్లక్ష్యాన్ని అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**ప్రాచీన భాషా పరిణామక్రమంపై డాక్యుమెంటేషన్**

తమిళుల తరహాలో ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తెలుగు భాషా పరిణామక్రమాన్ని సమగ్రంగా వివరించేలా ఒక ప్రత్యేక డాక్యుమెంటేషన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. తెలుగు సాహిత్యాన్ని గ్రంథస్థం చేస్తూ, అక్షర రూపాన్ని పరిరక్షిస్తూ భావితరాలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం నూరు శాతం ప్రోత్సాహాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. మాతృభాష ఏమాత్రం మృతభాషగా మారకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

**జానపద కళారూపాలు, నాటక రంగానికి పూర్వవైభవం**

మన రాష్ట్రానికి సొంతమైన పద్య నాటకంతో పాటు తోలుబొమ్మలాట, హరికథ, బుర్రకథ వంటి ప్రాచీన జానపద కళారూపాలను, పౌరాణిక, సాంఘిక నాటకాలను, పద్య నాటకాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి దుర్గేష్ ఉద్ఘాటించారు.

కళాకారులకు ప్రోత్సాహం:

ఇప్పటికే కవులు, కళాకారులు, సాంస్కృతిక రంగానికి పెద్దపీట వేస్తూ ఉగాది కళారత్న పురస్కారాలు, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా కందుకూరి పురస్కారాలు మరియు తెలుగు భాషా పురస్కారాలను, గుర్రం జాషువా, బోయి భీమన్న పురస్కారాలను అందించామని తెలిపారు. నాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు త్వరలోనే నంది నాటకోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగు ఉన్నతికి కృషి చేసిన మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాలను ఆగస్టు 4న విజయవాడలో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29న ఘనంగా తెలుగు భాషా దినోత్సవాన్ని, తెలుగు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు భాషా వికాసానికి కృషి చేసిన మహనీయులను స్మరించుకున్న మంత్రి దుర్గేష్ తెలుగు భాషకు నిజమైన రాయబారి మండలి బుద్ధ ప్రసాద్ అని కొనియాడారు. అలాగే తెలుగు భాషా పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న తేజస్వి పొడపాటి సేవలను అభినందించారు

**భాషా వికాసానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్**

అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ.. కాక్రోచ్ ఉద్యమం మాదిరిగా ప్రతి ఒక్కరూ తెలుగు భాషా పరిరక్షణకు, ఉనికికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. మంత్రి కందుల దుర్గేష్ పర్యాటక, భాషా సాంస్కృతిక రంగాల అభివృద్ధికి, భాషా వికాసానికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. తాము గతంలో భాష కోసం అనేక పోరాటాలు చేశామని, అయితే తొలిసారిగా యువతను భాగస్వామ్యం చేస్తూ "తెలుగు భవితను" ప్రోత్సహించేలా ఇలాంటి మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.

**తెలుగును ముందటి తరాలకు అందించే ప్రయత్నమే 'తెలుగు మహోత్సవం': ఏపీ సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి**

మన మాతృభాష తెలుగును భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించాలనే సంకల్పంతోనే 'తెలుగు మహోత్సవం' లాంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు. తెలుగు అత్యంత అందమైన, శ్రవణ సుందరమైన భాష అని కొనియాడిన ఆమె, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని భాషా వికాసానికి కృషి చేసిన మహనీయులను స్మరించుకున్నారు. నాటి వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు నుండి నేటి తరంలో భాషా సమృద్ధికి, పత్రికారంగానికి వన్నె తెచ్చిన ఈనాడు సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు వరకు తెలుగు భాష కోసం చేసిన విశేష కృషిని వివరించారు. తెలుగు భాష ఉనికి కోల్పోకుండా, అంతరించిపోకుండా కాపాడుకోవడమే ధ్యేయంగా ఇటువంటి వేడుకల ద్వారా నేటి తరం పిల్లలు, యువతలో భాష పట్ల పూర్తి అవగాహన నింపుతున్నామని చెప్పారు. నేటి తరం పిల్లలకు తెలుగుపై ఎలాంటి ద్వేషం లేదని, అయితే భాషను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా వారి నిత్య జీవితంలో అనుభవపూర్వకంగా ఉపయోగించే వాతావరణాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వంలో తెలుగు భాషకు, సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత లభిస్తుందని, రాబోయే రోజుల్లో భాషకు మంచి రోజులు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మనందరం ఐక్యంగా నిలబడి తెలుగు భాషా ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకుందామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మండలి వెంకటకృష్ణా రావు అధికార భాష సంఘం చైర్మన్ త్రివిక్రం రావు మాట్లాడుతూ.. తెలుగు ఉనికి కోసం, ఉన్నతి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని అన్నారు. తెలుగు అంతరించి పోయే ప్రమాదం లేదన్నారు. తెలుగు భాషా వికాసం కోసం మంత్రి కందల దుర్గేష్ చేస్తున్న ప్రయత్నాన్ని అభినందించారు.

**మంత్రి కందుల దుర్గేష్ చొరవతోనే ఈ ఉత్సవం: రేగుళ్ల మల్లికార్జున రావు**

రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావు మాట్లాడుతూ.. మంత్రి కందుల దుర్గేష్ చూపిన ప్రత్యేక శ్రద్ధ, చొరవ వల్లే చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఉండవల్లి గుహల వద్ద ఈ మహోత్సవాన్ని అత్యంత జయప్రదంగా నిర్వహించగలిగామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఈ వేదికను ఏర్పాటు చేసినందుకు మంత్రి దుర్గేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రముఖ గాయని శోభరాజ్ తెలుగు భాషా తియ్యదనాన్ని, దాని విశిష్టతను వివరిస్తూ అన్నమయ్య గేయాలు ఆలపించారు.






## మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

# కృషి ఫలితం

- నేరడి బ్యారేజీకి రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతులు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 పనుల్లో కీలక ముందడుగు
- శ్రీకాకుళం జిల్లా దశాబ్దాల కల సాకారమయ్యే దిశగా అడుగులు
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, సీఎం చంద్రబాబుకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు

**శ్రీకాకుళం, జూలై 26**

**అనంత జనశక్తి న్యూస్**



సిక్కోల ప్రజల దశాబ్దాల స్వప్నమైన నేరడి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. వంశధార ప్రాజెక్టు రెండో విడత కింద నేరడి బ్యారేజీ, దాని అనుబంధ నిర్మాణ పనులకు రూ.641.10 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ జలవనరుల శాఖ జీవో (జీవో ఆర్‌టీ సంఖ్య 432) జారీ చేసింది. భూసేకరణ, పునరావాస ఖర్చులన్నీ కూడా ప్రభుత్వం మంజూరు చేసిన ఈ నిధుల పరిధిలోనే పూర్తి చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు అచ్చెన్నాయుడి కృషి ఫలితం దశాబ్దాల కలకు ఊపిరి**

సిక్కోలు రైతాంగాన్ని సస్యశ్యామలం చేయడమే ధ్యేయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సాగించిన నిరంతర కృషి, పట్టుదలే ఈ భారీ నిధుల విడుదల వెనుక ముఖ్య చోదక శక్తిగా నిలిచాయి. జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించిన ఆయన, దశాబ్దాలుగా నేరడి కల తీరక శాపంగా మారిన ఈ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు అహర్నిశలు శ్రమించారు. పొరుగు రాష్ట్రంతో ముడిపడి ఉన్న అంతర్రాష్ట్ర సమస్యలు, ట్రిబ్యునల్ తీర్పుల చిక్కుముడులను విప్పడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిలా నిలిచి అడ్డంకులను తొలగించడంలో కీలక పాత్ర పోషించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో కలిసి పట్టు వదలకుండా అనుసరించిన వ్యూహాత్మక అడుగులతోనే ఈ చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైందని మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే ఈ స్వప్నం సాకారమైందన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఒక కీలక సాగునీటి ప్రాజెక్టుకు ఇన్ని నిధులు మంజూరు చేయించడం మంత్రి అచ్చెన్నాయుడికి జిల్లా నీటిపారుదల రంగంపై ఉన్న చిత్తశుద్ధికి, ప్రజా శ్రేయస్సుకు నిదర్శనమని స్థానిక రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది.

**రెండేళ్లలో పూర్తి చేసేలా కట్టుదిట్టమైన కార్యాచరణ**

నేరడి బ్యారేజీ నిర్మాణం పూర్తయితే వంశధార జలాలను సమగ్రంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని, తద్వారా శ్రీకాకుళం జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని మంత్రి తెలిపారు. నిర్దేశిత ప్రణాళిక ప్రకారం రాబోయే రెండేళ్ల వ్యవధిలోనే నిర్మాణాన్ని పూర్తి చేసి, వంశధార జలాలను చివరి ఆయకట్టు వరకు అందించి జిల్లాను ధాన్య భాండాగారంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# హింస కాదు, చర్చలే పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం హింసతో కాకుండా చర్చలు.. శాంతియుత నిరసనల ద్వారానే సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని అహిల్యానగర్‌లో మీడియాతో మాట్లాడిన అన్నా హజారే.. ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత కావాలని పేర్కొన్నారు. ప్రజలు తమ డిమాండ్లను వ్యక్తం చేసే హక్కు కలిగి ఉన్నప్పటికీ.. వాటిని హింసాత్మక మార్గాల్లో సాధించేందుకు ప్రయత్నించడం సరైన పద్ధతి కాదని అన్నా హజారే అభిప్రాయపడ్డారు. ఉద్రిక్తతలు సృష్టించడం లేదా నియంతృత్వ ధోరణిని అవలంబించడం వల్ల సమస్యలు పరిష్కారం కావని.. చర్చల ద్వారానే సానుకూల ఫలితాలు వస్తాయని వెల్లడించారు. తన ఉద్యమాల అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ.. తాను ఇప్పటివరకు 22 సార్లు నిరాహార దీక్షలు చేపట్టానని అన్నా హజారే గుర్తు చేశారు. అయితే ఏ సందర్భంలోనూ హింసను ప్రోత్సహించలేదని చెప్పారు. శాంతియుత పోరాటాల ఫలితంగానే 10 కీలక చట్టాలు అమల్లోకి వచ్చాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పు తీసుకురావాలంటే సహనం, చర్చలు, అహింసే అత్యంత ప్రభావవంతమైన మార్గాలు అని అన్నా హజారే వివరించారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వాలు గౌరవించాలని.. ప్రజా సంక్షేమం కోసం అవసరమైతే ముందడుగు వేయడంలో ఎలాంటి తప్పు లేదని అన్నా హజారే అన్నారు. మంత్రుల రాజీనామా వంటి డిమాండ్లను కూడా రాజ్యాంగబద్ధమైన, శాంతియుత పద్ధతుల్లోనే సాధించాలని హితవు పలికారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా హింసను ఆశ్రయించకూడదని ప్రజలకు, ప్రభుత్వాలకు అన్నా హజారే ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, అహింస, పరస్పర అవగాహన ద్వారానే శాశ్వత పరిష్కారాలు సాధ్యమవుతాయని మరోసారి స్పష్టం చేశారు.

# బీటెక్ కనీస వార్షిక ఫీజు రూ.47 వేలు!

**ప్రభుత్వం కీలక నిర్ణయం**

**అమరావతి, జులై 26, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ అండ్ ఎయిడెడ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు సంబంధించిన ఫీజులపై కీలక నిర్ణయం తీసుకుంది. 202627 విద్యా సంవత్సరానికి బీటెక్, బీఆర్క్, బీటెక్ (మెరైన్ ఇంజినీరింగ్) కోర్సులకు తాత్కాలిక ఫీజును ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన జీవో ప్రకారం.. ఈ విద్యా సంవత్సరానికి కనీస వార్షిక ఫీజును రూ.47 వేలుగా నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫీ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీ తుది ఫీజులను నిర్ణయించే వరకు ఈ ఇంటరిమ్ ఫీజులు అమల్లో ఉంటాయి. EAPCET 2026 కౌన్సెలింగ్ ప్రక్రియ ఆలస్యం కాకుండా కొనసాగించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గతంలో నిర్ణయించిన ఫీజులు రూ.47 వేల కంటే ఎక్కువగా ఉన్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు అదే ఫీజులను కొనసాగించవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. కమిటీ తుది ఫీజులను ప్రకటించిన తర్వాత ఆ నిర్ణయం ప్రకారం ఫీజులు అమలులోకి వస్తాయని పేర్కొంది. తుది ఫీజులు నిర్ణయించిన తర్వాత ఇంటరిమ్ ఫీజు కంటే తక్కువగా ఉంటే విద్యార్థులకు అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని కళాశాలలు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది లేదా భవిష్యత్ ఫీజుల్లో సర్దుబాటు చేయాలి. ఒకవేళ తుది ఫీజు ఎక్కువగా నిర్ణయిస్తే.. ఆ ఫీజును ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసూలు చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రతి కళాశాల కూడా తుది ఫీజు నిర్ణయాన్ని తప్పనిసరిగా అమలు చేస్తామని అనుబంధ విశ్వవిద్యాలయానికి అంగీకార పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం కొత్త మార్గదర్శకాల ప్రకారం.. కళాశాలలు నోటిఫై చేసిన ఫీజు తప్ప మరే పేరుతోనూ అదనపు మొత్తాలు వసూలు చేయకూడదు. అలాగే 202627 విద్యా సంవత్సరానికి అనుబంధ గుర్తింపు లేని కళాశాలలు ఎలాంటి ఫీజులు వసూలు చేసే హక్కు ఉండదని స్పష్టం చేసింది. కొత్తగా ప్రారంభించిన కోర్సులకు అదే కళాశాలలో అమలులో ఉన్న ఇతర కోర్సుల ఫీజులను తాత్కాలికంగా వర్తింపజేయాలని, అనంతరం కమిటీ నిర్ణయించే కోర్సు వారీ ఫీజులు అమల్లోకి వస్తాయని పేర్కొంది. విద్యార్థులు అడ్మిషన్ సమయంలో వసూలు చేస్తున్న ఫీజు తాత్కాలికమని, APHEFRMC తుది నిర్ణయం తర్వాత మార్పులకు లోబడి ఉంటుందని కళాశాలలు తప్పనిసరిగా లిఖితపూర్వకంగా తెలియజేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# కింజరాపు వారింట ఆనందం.

- హానర్స్ డిగ్రీ పట్టా అందుకున్న కృష్ణ మోహన్ నాయుడు
- దిల్లీ ఓపీ జిందాల్ యూనివర్శిటీ స్నాతకోత్సవంలో పట్టా ప్రదానం
- వేడుకలకు హాజరయిన కింజరాపు అచ్చెన్నాయుడు నాయుడు దంపతులు,కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దంపతులు

**దిల్లీ, శ్రీకాకుళం జూలై 26, అనంత జనశక్తి న్యూస్**




రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కింజరాపు , విజయమాధవి దంపతుల పెద్ద కుమారుడు కింజరాపు కృష్ణమోహన్ నాయుడు హానర్స్ డిగ్రీ పట్టా అందుకున్నారు. దిల్లీ కేంద్రంగా విఖ్యాత వర్శిటీ ఓపీ జిందాల్ గ్లోబల్ వర్శిటీలో ఆయన ఎల్ఎల్బీ లో హానర్సు డిగ్రీ అభ్యసించి కింజరాపు కుటుంబానికి వన్నె తెచ్చారు. చదువుతోనే గొప్ప గుర్తింపు అన్న మాటకు నిరూపణగా ఆయన ఇవాళ

తన యూనివర్శిటీలీ నిర్వహించిన స్నాతకోత్సవంలో డిగ్రీ పట్టా అందుకుని తల్లిదండ్రులలో ఆనందోత్సాహాలు నింపారు. వేడుకలకు కింజరాపు అచ్చెన్న దంపతులు, కింజరాపు రామ్మోహన్ నాయుడు దంపతులు హాజరయి కృష్ణమోహన్ ను నిండు మనస్సుతో దీవించారు. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని కృష్ణ మోహన్ కు పలువురు శుభాకాంక్షలు అందించారు. ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ

- రైతులకు పంట రక్షణ, నేల తేమ సంరక్షణపై ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. ప్రత్యామ్నాయ పంటలు, అత్యవసర విత్తన ప్రణాళికను మిషన్ విధానంలో అమలు చేయాలి
- 24×7 రాష్ట్ర ఎల్‌నినో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి
- రైతులకు నిరంతరం వాతావరణ, పంటలపై సూచనలు అందించాలి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, జూలై 26:అనంత జనశక్తి ప్రతినిధి**

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షపాతం లోటు కొనసాగుతున్న నేపథ్యంలో ఎల్‌నినో పరిస్థితులను నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తూ రైతుల పంటలను రక్షించేందుకు సమగ్ర కార్యాచరణ అమలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. పంటల రక్షణ, నేలలో తేమ సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, అత్యవసర విత్తనాల లభ్యత, వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ విధానాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల క్షేత్రస్థాయి అధికారులతో ఆదివారం వెబినార్ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నైరుతి రుతుపవనాల కాలంలో జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం గణనీయంగా లోటుగా నమోదైందన్నారు. సీజన్ సాధారణ వర్షపాతం 580.1 మి.మీ. కాగా, ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా 225.7 మి.మీ. వర్షపాతం నమోదవ్వాల్సి ఉందని, అయితే కేవలం 104.5 మి.మీ. మాత్రమే నమోదై 53.7 శాతం లోటు ఏర్పడిందని వివరించారు. మొత్తం 28 జిల్లాల్లో 21 జిల్లాలు 'వర్షపాతం లోటు' కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. పశ్చిమ గోదావరి, అన్నమయ్య, తూర్పు గోదావరి, విశాఖపట్నం, చిత్తూరు, ప్రకాశం జిల్లాలు కలిపి ఆరు జిల్లాలు 'తీవ్ర వర్షపాతం లోటు' కేటగిరీలో ఉన్నాయని, నెల్లూరు జిల్లాలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైందని చెప్పారు.

మండల స్థాయిలో 249 మండలాలు 'తీవ్ర వర్షపాతం లోటు'లో, 359 మండలాలు 'వర్షపాతం లోటు'లో ఉండగా, కేవలం రెండు మండలాల్లో మాత్రమే 'అత్యధిక వర్షపాతం' నమోదైందని మంత్రి తెలిపారు. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, కోస్తాంధ్ర, రాయలసీమ అనే నాలుగు వ్యవసాయ వాతావరణ మండలాలన్నీ ఇప్పటికీ 'వర్షపాతం లోటు' కేటగిరీలోనే కొనసాగుతున్నాయని చెప్పారు. వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా జిల్లాస్థాయి ప్రమాద అంచనాలు, రైతులకు సూచనలు, ప్రత్యామ్నాయ విత్తనాల ప్రణాళిక మరియు దశలవారీ పంటల అత్యవసర ప్రణాళిక చర్యలను ఇప్పటికే ప్రారంభించామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంచనా వేసిన 8,489 రైతు సేవా కేంద్రాలు మరియు 688 మండలాల్లో, 1,357 రైతు సేవా కేంద్రాలు, 168 మండలాలు అధిక ప్రమాద స్థాయిలో ఉన్నాయని వివరించారు.

**సాగు విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి**

జూలై 25 నాటికి, 12 జిల్లాల్లో సాధారణంగా సాగు కావాల్సిన విస్తీర్ణంలో 50 శాతం కంటే తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయని మంత్రి తెలిపారు. అన్నమయ్య జిల్లాలో 9 శాతం, బాపట్లలో 5 శాతం, ప్రకాశంలో 15 శాతం మరియు మార్కాపురంలో 15 శాతంతో పరిస్థితి అత్యంత ప్రభావితంగా ఉందన్నారు. మరో 10 జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే 51 శాతం నుంచి 100 శాతం మధ్య సాగు నమోదైందని చెప్పారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి సహా ఆరు జిల్లాల్లో సాధారణ సాగు స్థాయిని మించి సాగు నమోదైందని మంత్రి వివరించారు. అధిక ప్రమాదంలో ఉన్న 168 మండలాల్లో, సీజన్ సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 39 శాతం సాగు నమోదైందని తెలిపారు. కర్నూలు జిల్లాలోని అధిక ప్రమాద మండలాలు సాగులో ముందంజలో ఉండగా, మార్కాపురం ప్రాంతంలోని అధిక ప్రమాద మండలాలు రాష్ట్రంలో అత్యంత వెనుకబడి ఉన్నాయని చెప్పారు. సీజన్ సాధారణ పంట విస్తీర్ణం 30.84 లక్షల హెక్టార్లు కాగా, ఇప్పటివరకు మొత్తం 16.35 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని, ఇది సీజన్ సాధారణ విస్తీర్ణంలో 39 శాతం మరియు ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా ఉండాల్సిన విస్తీర్ణంలో 74 శాతమని మంత్రి తెలిపారు. జనుము/మెస్తా, వరి, సోయాబీన్ , పత్తి పంటల సాగు తులనాత్మకంగా మెరుగైన పురోగతిని చూపుతోందని, వేరుశనగ, పొద్దుతిరుగుడు, జొన్న, ఉలవ పంటల సాగు గణనీయంగా వెనుకబడి ఉందని వివరించారు. రాష్ట్రంలో ప్రధాన పంటైన వరి, సీజన్ సాధారణ సాగు విస్తీర్ణంలో 34 శాతం, సాధారణంగా ఉండాల్సిన విస్తీర్ణంలో 79 శాతంగా నమోదైందని మంత్రి తెలిపారు.

**పీఎండీఎస్ ద్వారా రైతులకు విస్తృత సూచనలు**

రైతు సాధికార సంస్థ-పీఎండీఎస్ కింద 23 లక్షల మంది రైతులు, 25 లక్షల ఎకరాల లక్ష్యానికి గాను, ఇప్పటివరకు 14.82 లక్షల మంది రైతులు అంటే 67 శాతం, 16.67 లక్షల ఎకరాలు అంటే 64 శాతం లక్ష్యాన్ని సాధించామని మంత్రి తెలిపారు. పెల్లెటైజ్డ్ పీఎండీఎస్ కింద 4.19 లక్షల మంది రైతులు అంటే 28 శాతం, 4.20 లక్షల ఎకరాలు అంటే 25 శాతం పురోగతి నమోదైందన్నారు. అంతరకృషి, ఆకులపై ఎరువుల పిచికారీ, నేలలో తేమ సంరక్షణ, పంట పొలాల సరిహద్దుల్లో పంటల సాగుకు సంబంధించి రైతులకు 1.68 కోట్ల సూచనలు జారీ చేశామని మంత్రి తెలిపారు. కందులు, పెసలు, కొర్రలు, మినుములు, నువ్వులకు సంబంధించిన 14,078 క్వింటాళ్ల అత్యవసర ప్రత్యామ్నాయ విత్తనాలను ఏపీ స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా సిద్ధం చేశామని చెప్పారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధనా కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాల్లో కూడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరి పంట నుంచి ఇతర పంటలకు మార్పిడి చేయడానికి నిర్దేశించిన 1.29 లక్షల హెక్టార్ల లక్ష్యానికి గాను, ఇప్పటివరకు 11,422 హెక్టార్లు అంటే 9 శాతం మాత్రమే సాధించామని మంత్రి తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగును మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**అత్యవసర విత్తన ప్రణాళిక అమలు చేయాలి**

మొదటి దశలో జూలై 31 నాటికి ప్రధానంగా అనంతపురం, కర్నూలు, మార్కాపురం ప్రాంతాల్లోని 1.78 లక్షల హెక్టార్లకు 26,950 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని మంత్రి తెలిపారు. రెండో దశలో ఆగస్టు 15 నాటికి 21 జిల్లాల్లోని 429 మండలాల్లో 4.78 లక్షల హెక్టార్లకు అదనంగా 95,838 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని చెప్పారు. అవసరమైన విత్తనాలను సకాలంలో రైతులకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**జిల్లా వ్యవసాయ అధికారులకు కీలక ఆదేశాలు**

నీటిపారుదల ఆయకట్టు ప్రాంతాల్లో కూడా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం, కాలువల ద్వారా నీటి విడుదలలు తక్కువగా ఉండటాన్ని దృష్టిలో ఉంచుకొని, నీటిపారుదల, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా కాలువ చివరి ప్రాంతాలు, తేమ కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. దీర్ఘకాలిక వరి రకాల నుంచి ఇతర ప్రత్యామ్నాయ పంటలకు మారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పరిపాలన, వ్యవసాయ అనుబంధ శాఖలు, శాస్త్రవేత్తలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులు , ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రత్యేక జిల్లా సమీక్ష, సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితిని ప్రతిరోజూ నిశితంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయి అధికారులు అవసరమైన పంట రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని స్పష్టం చేశారు. ఇంకా అమలు చేయని ప్రాంతాలతో పాటు ప్రధాన పంట సాగు ప్రాంతాల్లో కూడా పీఎండీఎస్ విత్తన పెల్లెటైజేషన్ కార్యక్రమాలను మిషన్ విధానంలో చేపట్టాలని సూచించారు. రైతుల వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రాంతాలవారీ ప్రత్యేక సూచనలను క్రమం తప్పకుండా రైతులకు పంపించాలని మంత్రి తెలిపారు. జిల్లా వ్యవసాయ అత్యవసర ప్రణాళికలకు అనుగుణంగా డీఏఏటీటీసీలు, కేవీకేలు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో సంప్రదించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల్లో అత్యధిక సంఖ్యలో రైతులు నమోదు అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావ నివారణ చర్యలను సమర్థంగా అమలు చేయడానికి అవసరమైన అన్ని అంశాల ప్రస్తుత పరిస్థితిని జిల్లా వనరుల కేంద్రాలు సమీక్షించాలని తెలిపారు. జిల్లా ప్రత్యేక రైతు సూచనలను విస్తృతంగా తెలియజేయడానికి ఐసీసీ హెల్ప్‌లైన్ 155251, టెలివిజన్, రేడియో, పత్రికలు, సామాజిక మాధ్యమాలు, ఐవీఆర్ఎస్/ఎస్ఎంఎస్, వాట్సాప్, రైతు సేవా కేంద్రాల ద్వారా విస్తృత రైతు సమాచార ప్రచార కార్యక్రమాన్ని చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

**24×7 రాష్ట్ర ఎల్‌నినో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

అన్ని జిల్లాలు, మండలాలు, రైతు సేవా కేంద్రాల్లో మిషన్ విధానంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రాష్ట్ర ఎల్‌నినో పంట రక్షణ మిషన్‌ను ప్రారంభించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. వాతావరణం, ఉపగ్రహ సమాచారం, నీటి లభ్యత, క్షేత్రస్థాయి సమాచారాన్ని సమీకరించే విధంగా 24×7 రాష్ట్ర ఎల్‌నినో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. దీని ద్వారా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం, సకాలంలో సూచనలు ఇవ్వడం మరియు తక్షణ చర్యలు తీసుకోవడం సాధ్యమవుతుందని తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, కృషి విజ్ఞాన కేంద్రాలు, సంబంధిత శాఖలు, నీటిపారుదల శాఖ సంయుక్త క్షేత్ర పర్యటనల ద్వారా మండల స్థాయిలో శాస్త్రీయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. వాతావరణ సూచనలు, అత్యవసర పంటల ప్రణాళిక, నేలలో తేమ సంరక్షణ మరియు పంటలు వాడిపోవడం, ఎండిపోవడం నివారించడానికి తక్కువ ఖర్చుతో చేపట్టగల చర్యలపై ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహాలతో ప్రతి రైతు సేవా కేంద్రంలో ప్రతిరోజూ రైతు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. స్థానిక పంటల విధానం, నేల రకం, వర్షపాతం, నీటిపారుదల, భూగర్భ జలాల లభ్యత ఆధారంగా వరి నుంచి అనువైన ఆరుతడి పంటలకు మారేలా ప్రతి రైతు సేవా కేంద్రానికి ప్రత్యేక పంటల సూచనలు జారీ చేయాలని తెలిపారు. పంటలను కాపాడేందుకు అవసరమైన రక్షక తడులకు ప్రాధాన్యం ఇవ్వడం, కాలువల నీటి విడుదలలను శాస్త్రీయంగా ప్రణాళిక చేయడం మరియు సూక్ష్మ నీటిపారుదల విధానాలను అమలు చేయడం ద్వారా శాస్త్రీయ నీటి నిర్వహణ చేపట్టాలని మంత్రి సూచించారు. అత్యవసర విత్తనాలు, సూక్ష్మ పోషకాలు, ఆకులపై పిచికారీ చేసే పోషకాలు మరియు తక్కువ ఖర్చుతో లభించే యాంటీట్రాన్స్‌పిరెంట్లు సహా అవసరమైన వ్యవసాయ ఉత్పాదకాలను సకాలంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కరువును తట్టుకునే విత్తనాలు, బిందు సేద్యం, మల్చింగ్, వ్యవసాయ చెరువులు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి వాతావరణ మార్పులను తట్టుకునే సాంకేతిక పరిజ్ఞానాలకు లక్ష్యిత రాయితీలు అందించాలని మంత్రి తెలిపారు. ప్రతి వారం జిల్లా సమీక్ష కమిటీ సమావేశాలు నిర్వహించడం, పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించడం ద్వారా జిల్లాస్థాయి పర్యవేక్షణను బలోపేతం చేయాలని ఆదేశించారు.

**పంటల బీమా నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలి**

ఖరీఫ్-2026లో నోటిఫై చేసిన వరి మినహా అన్ని పంటలకు పంటల బీమా - పీఎంఎఫ్‌బీవై మరియు ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ కింద నమోదు చేసుకునే చివరి తేదీ 2026 జూలై 31 అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వరి పంటకు చివరి తేదీ 2026 ఆగస్టు 15 అని చెప్పారు. అర్హులైన రైతులు గరిష్ఠ సంఖ్యలో నమోదు అయ్యేలా సంబంధిత భాగస్వాములందరూ విస్తృత అవగాహన మరియు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్-2026 సీజన్‌లో రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు, ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రైతులకు అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి, రైతులకు అవసరమైన సూచనలు, ప్రత్యామ్నాయ పంటలు, అత్యవసర విత్తనాలు మరియు పంట రక్షణ చర్యలను సకాలంలో అందించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, డైరెక్టర్ మంజీర్ జిలాని, రైతు సాధికారిక సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, 28 జిల్లాల డీఏవోలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# జి.ఓ. నెం. 396 రిజిస్ట్రేషన్ సేవల్లో సంస్కరణల దిశగా అడుగా? లేక లేఖర్ల ఉపాధికి ముప్పా?

**- కర్రే సుబ్బారావు, జర్నలిస్టు.**

భూమి, ఇల్లు,స్థలం, స్థిరాస్తి అనేవి ప్రతి కుటుంబ జీవితంలో అత్యంత విలువైన ఆస్తులు. అలాంటి ఆస్తుల కొనుగోలు, అమ్మకం, వారసత్వం, దానం, తనఖా వంటి లావాదేవీలకు చట్టబద్ధత కల్పించే ప్రభుత్వ వ్యవస్థే రిజిస్ట్రేషన్లు మరియు స్టాంపుల శాఖ. ఈ శాఖ ద్వారా ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. అయితే, ఈ శాఖ పేరు వినగానే ప్రజలకు గుర్తుకు వచ్చేవి ప్రజల ఆస్తులకు భద్రత కల్పిస్తూ దస్తావేజు రిజిస్ట్రేషన్లతో పాటు దళారులు, లేఖర్లు, లంచాలు, ఆలస్యం, అదనపు వసూళ్లు వంటి ఆరోపణలు సర్వసాధారణంగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం యీ ఏడాది జూన్ 30న జి.ఓ. ఎం.ఎస్. నెం. 396ను జారీ చేస్తూ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు (ఆర్.ఎస్.కె.) ను పబ్లిక్ ప్రైవేటు పార్టనర్షిప్ (PPP) విధానంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.కూటమి ప్రభుత్వం దీన్ని సంస్కరణగా చెబుతుంటే, డాక్యుమెంట్ రైటర్లు (లేఖర్లు) మాత్రం ఇది తమ జీవనోపాధిపై దెబ్బ అని ఆరోపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పెన్‌డౌన్ సమ్మె చేపట్టారు.

రిజిస్ట్రేషన్లు మరియు స్టాంపుల శాఖ – లేఖర్ల వ్యవస్థ :

రిజిస్ట్రేషన్లు మరియు స్టాంపుల శాఖ సేల్ డీడ్స్ (అమ్మకపు దస్తావేజులు), గిఫ్ట్ డీడ్లు (దాన/సెటిల్మెంటు దస్తావేజులు), మార్ట్గేజ్ పత్రాలు, లీజ్ ఒప్పందాలు, వీలునామా (విల్) రిజిస్ట్రేషన్, భాగస్వామ్య ఒప్పందాలు, చెల్లు రశీదులు తదితర సేవలు నమోదు చేస్తుంది. అలాగే ప్రతి రిజిస్ట్రేషన్ చట్టపరమైన హక్కును కల్పిస్తుంది. ఈ శాఖ ద్వారా ప్రభుత్వానికి స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో గణనీయమైన ఆదాయం సమకూరుతుంది. రిజిస్ట్రేషన్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచే ప్రజలకు దస్తావేజులు తయారు చేయడంలో సహాయం చేసే వృత్తి (లేఖర్ల వ్యవస్థ) అభివృద్ధి చెందింది.వీరినే సాధారణంగా లేఖర్లు లేదా డాక్యుమెంట్ రైటర్స్ అని పిలుస్తారు. రిజిస్ట్రేషన్ చట్టాలకు అనుసరించి దస్తావేజు తయారు చేయడం,




చట్టపరమైన అంశాలు పరిశీలించడం, సర్వే నంబర్లు నమోదు, మార్కెట్ విలువ వివరాలు, స్టాంప్ డ్యూటీ వివరాలు (ప్రభుత్వానికి చెల్లించవలసిన ఛార్జీలు) వంటి సేవలు ప్రజలకు అందించడానికి రిజిస్ట్రేషన్ శాఖకు, జనానికి మధ్య వారదులుగా ఈ లేఖర్లు పని చేస్తూ తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం జి.ఓ. 396 విడుదలతో వివాదం :

కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిసరాల్లో దళారుల వ్యవస్థ ప్రజలకు ఇబ్బందులను కలిగిస్తున్న అంశంగా పలుమార్లు చర్చకు వచ్చింది.దళారులు ప్రభుత్వ ఫీజులకు అదనంగా అక్రమంగా డబ్బులు వసూలు చేయడం, త్వరగా పని చేయిస్తామని హామీ ఇవ్వడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం వంటి ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు చట్టాలపై సరైన అవగాహన లేకపోవడం, క్లిష్టమైన విధానాలు, కార్యాలయాల్లో ఆలస్యం వంటి అంశాలు ఈ దళారుల వ్యవస్థకు కారణంగా చెబుతున్నారు. చట్టాల్లోని లొసుగులను అడ్డుపెట్టుకొని లేఖర్లు, దళారులు కలిసి సాధారణ అమాయక జనాన్ని దోచుకుతింటున్నారన్నది జగమెరిగిన సత్యం. కొన్నిచోట్ల కొన్ని సందర్భాల్లో దళారులు లేఖర్ల ద్వారా సంబంధిత రిజిష్టారు వారి కార్యాలయం అధికారులతో కుమ్మక్కు అయి అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించిన ఉదంతాలు, ఏసీబీ అధికారుల దాడుల్లో పట్టుబడ్డ రిజిస్ట్రేషన్ అధికారులు కొకొల్లలు. ఈ నేపథ్యంలో దళారుల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలు, స్లాట్ బుకింగ్, డిజిటల్ చెల్లింపులు, పారదర్శక విధానాలను అమలు చేస్తూ ప్రజలు నేరుగా సేవలు పొందే అవకాశాలను విస్తరిస్తూ రిజిస్ట్రేషన్ శాఖలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొన్ని సంస్కరణలు తీసుకొచ్చింది.

ఈ సంస్కరణలలో భాగంగా యీ ఏడాది జూన్ 30న జి.ఓ. ఎం.ఎస్. నెం. 396ను జారీ చేస్తూ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు (ఆర్.ఎస్.కె.) ను పబ్లిక్ ప్రైవేటు పార్టనర్షిప్ (PPP) విధానంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీనిని మొదటగా జిల్లా హెడ్ క్వార్టర్ లో ప్రారంభమై తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సబ్ రిజిస్ట్రారు కార్యాలయానికి విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. పాస్ పోర్టు సేవా కేంద్రాలు మాదిరిగా ఇవి పనిచేస్తాయని, సబ్ రిజిష్ట్రారు వారి కార్యాలయాలకు అనుసంధానంగా పిపిపి విధానంలో ఇవి ఫ్రంట్ ఆఫీసులుగా పనిచేస్తాయని, సబ్ రిజిష్ట్రారు ఆఫీసు బ్యాక్ ఆఫీసులుగా ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో జీవో 396 అమలుతో డాక్యుమెంట్ రైటర్ల అవసరం తగ్గుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా వేలాది కుటుంబాల లేఖర్లు, వారి సహాయకులు, కంప్యూటరు ఆపరేటర్లు కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా సంప్రదాయ లేఖర్లుకు వారి కక్షిదారులైన ప్రజలు కూడా సహకరించడంతో లేఖర్లు తమ నిరసన ప్రభుత్వానికి వ్యక్తపరుస్తూ పెన్ డౌన్ కార్యక్రమంతో గత వారం రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.సంప్రదాయ లేఖర్ల పెన్ డౌన్ తో యీ వారంలో రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం 90 శాతం వరకూ తగ్గిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

డాక్యుమెంట్ తయారీ అనేది కేవలం కంప్యూటర్ డేటా ఎంట్రీ మాత్రమే కాదని, ప్రతి దస్తావేజు చట్టపరమైన అంశాలతో కూడుకున్నదని, చిన్న తప్పు కూడా కోర్టు వివాదాలకు దారితీస్తుందని, అనుభవజ్ఞులైన డాక్యుమెంట్ రైటర్లు లేకుంటే ప్రజలు నష్టపోతారని లేఖర్లు స్పష్టం చేస్తున్నారు. జీవో నెం. 396 వెంటనే రద్దు చేయాలని, లేఖర్ల జీవనోపాధిని, వారి వృత్తిని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. లేఖర్ల లైసెన్స్ లను పునరుద్ధరించాలని వారు కోరుకుంటున్నారు.

ప్రభుత్వ వాదన ప్రకారం జీవో నెం. 396 రిజిస్ట్రేషన్ సేవలను ఆధునీకరించే ప్రయత్నంగా కనిపిసున్నప్పటికీ దీనివల్ల లేఖర్ల ఉపాధి, పిపిపి విధానం, పబ్లిక్ డేటా ఎంట్రీ వ్యవస్థ, దళారుల ప్రభావం వంటి అంశాలపై సహజంగానే అనుమానాలున్నాయి. కాలానుగుణంగా డిజిటల్ సేవలు అవసరమే కానీ సంప్రదాయ లేఖర్ల అనుభవాన్ని పూర్తిగా పక్కన పెట్టకూడదని, వారికి శిక్షణ ఇచ్చి కొత్త వ్యవస్థలో భాగస్వాములను చేయాలని మేధావుల అభిప్రాయంగా కనిపిస్తోంది. ప్రభుత్వం లక్ష్యమైన పారదర్శకత, వేగవంతమైన సేవలతో పాటు లేఖర్ల సంఘాల ఆందోళన, వారి జీవనోపాధి అంశాలు పరిగణనలోకి తీసుకోవాలని అప్పుడే సంస్కరణలు విజయవంతమవుతాయని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. అదే సమయంలో అవినీతిని అరికట్టడిలో భాగంగా లంచగొండి అధికారులు, దళారులు, వారికి సహకరిస్తున్న వారికి చట్ట ప్రకారం కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే ఈ సంస్కరణల అసలు విజయానికి ప్రమాణంగా నిలుస్తాయి.

## ఇది ముగింపు కాదు, ఆరంభమే

(మొదటి పేజీ తరువాయి)




ఈ ఉద్యమం ముగిసినప్పటికీ తమ లక్ష్యం ఇంకా పూర్తికాలేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే ఇది ముగింపు కాదు.. కేవలం ఆరంభమే అని తేల్చి చెప్పారు. దేశ విద్యా వ్యవస్థలో పారదర్శకత, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాక్రోచ్ జనతా పార్టీ ప్రయాణం కొనసాగుతుందని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. తన జీవితంలోనే గత 37 రోజులు అత్యంత కఠినమైనవని పేర్కొన్న అభిజీత్ దీప్కే.. ఇప్పుడు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా నిద్రపోగలుగుతున్నానని చెప్పారు. నీట్ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం.. తమ ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించడం ఉద్యమానికి కీలక విజయంగా అభివర్ణించారు. అయితే.. ఇది తుది గమ్యం కాదని, విద్యార్థుల హక్కుల కోసం ఇంకా పెద్ద ప్రయాణం ముందుందని ఆయన వ్యాఖ్యానించారు. జంతర్‌మంతర్‌లో 37 రోజుల పాటు నిరసనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే.. హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం ఉద్యమానికి అండగా నిలిచిన యువత త్యాగాన్ని ఎప్పటికీ మరచిపోలేనని తేల్చి చెప్పారు. అనారోగ్య కారణంగా ప్రతి ఒక్కరిని వ్యక్తిగతంగా కలవలేకపోయినందుకు క్షమాపణలు కూడా చెప్పారు. ఈ క్రమంలోనే తమ ఉద్యమాన్ని విమర్శించిన వారికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. విమర్శల వల్లే తమ పనితీరును మరింత మెరుగుపరుచుకునే అవకాశం లభించిందని.. సరైన ప్రశ్నలు ఉద్యమాన్ని బలోపేతం చేశాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. యువత మద్దతుతో ప్రారంభమైన ఈ ఉద్యమం భవిష్యత్తులో మరిన్ని ప్రజా సమస్యలపై కూడా కొనసాగుతుందని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

# పాకిస్థాన్ ఉగ్రవాద కేంద్రాలు నిర్మిస్తోంది

- భారత్ డేటా సెంటర్లు నిర్మిస్తే..
- భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**న్యూఢిల్లీ, జులై 26 అనంతజనశక్తి న్యూస్**



భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కార్గిల్ విజయ్ దివాస్ సందర్భగా లడఖ్‌లోని ద్రాస్ వద్ద ఆయన ప్రసంగించారు. ఒకవైపు భారతదేశం ఆవిష్కరణలు, అభివృద్ధి దిశగా శరవేగంగా దూసుకెళ్తుంటే.. మరోవైపు పాకిస్థాన్ మాత్రం సరిహద్దు తీవ్రవాదానికే మద్దతు ఇస్తూ నాశనమవుతోందని స్పష్టమైన వ్యత్యాసాన్ని ఎత్తిచూపారు. "భారత్ డేటా సెంటర్లను నిర్మిస్తుంటే.. పాకిస్థాన్ మతోన్మాద కేంద్రాలను నిర్మిస్తోంది. భారత్ యూపీఐ ద్వారా ప్రపంచాన్ని అనుసంధానిస్తుంటే, పాకిస్థాన్ హవాలా ద్వారా ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది" అని ఆయన ఎద్దేవా చేశారు. భారత్ నవతరం స్టార్టప్‌ల సంస్కృతిని ప్రోత్సహిస్తుంటే, పాకిస్థాన్ మాత్రం ఉగ్రవాద ఆవాసాలను పెంచి పోషిస్తోందని మండిపడ్డారు. "భారతదేశం సెమీకండక్టర్లను తయారు చేస్తుంటే.. పాకిస్థాన్ ఆత్మాహుతి బాంబర్లను తయారు చేస్తోంది. భారత్ అంతరిక్షంలోకి శాటిలైట్లను పంపుతుంటే, దాయాది దేశం సరిహద్దు దాటించి ఉగ్రవాదులను పంపుతోంది. ప్రపంచానికి భారత్ సాఫ్ట్‌వేర్ అందిస్తుంటే, పాక్ ఉగ్రవాదాన్ని సరఫరా చేస్తోంది" అని రాజ్‌నాథ్ తీవ్ర పదజాలంతో విమర్శించారు. భారత్ పురోగతిని అడ్డుకోవడానికి ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడినా సహించేది లేదని, మన సాయుధ దళాలు తగిన రీతిలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించారు. అంతేకాకుండా, పాకిస్థాన్‌తో ఎలాంటి చర్చలైనా కేవలం పాక్ ఆక్రమిత కాశ్మీర్ అంశంపైనే ఉంటాయని, అది ఎప్పటికీ భారతదేశంలో భాగమేనని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ స్పష్టమైన విధానాన్ని పునరుద్ఘాటించారు.

మరోవైపు, 1999 కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించేందుకు ద్రాస్‌లోని కార్గిల్ వార్ మెమోరియల్ వద్ద 'శ్రద్ధాంజలి సమారోహ్' శౌర్య సంధ్య కార్యక్రమాలను భారత సైన్యం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రక్షణ మంత్రి, అమరజవాన్ల స్మారకం వద్ద నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు జ్ఞాపకార్థ కలశాలను అందజేశారు. ఆపరేషన్ విజయ్ 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలను నిర్వహించారు. మంచుతో కప్పబడిన శిఖరాలను, శత్రువుల కాల్పులను లెక్కచేయకుండా 1999 జూలై 26న కార్గిల్ ఎత్తులను తిరిగి స్వాధీనం చేసుకుని భారత సైన్యం సాధించిన చారిత్రాత్మక విజయానికి ప్రతీకగా ఈ రోజును 'కార్గిల్ విజయ్ దివాస్'గా దేశవ్యాప్తంగా జరుపుకుంటారు.

## శస్త్ర చికిత్స అనంతరం వేగంగా కోలుకుంటున్నా

(మొదటిపేజీ తరువాయి)

షర్మిల త్వరగా కోలుకోవాలి: చంద్రబాబు, పవన్, లోకేశ్

వైఎస్ షర్మిల త్వరగా కోలుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. ఆమెకు మంచి ఆరోగ్యం చేకూరాలని.. మనోధైర్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి రావాలని చంద్రబాబు పేర్కొన్నారు. షర్మిల సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా ప్రజా జీవితంలోకి రావాలని కోరుకుంటున్నట్లు పవన్, లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

సోమవారం | రంగారెడ్డి
27.07.2026

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం






# మన గుండెకు పసుపు ఒక 'బంగారు కవచం'.. ఇది కార్డియాలజిస్ట్ మాట

మన భారతీయ వంట గదిలో ఉండే అనేక పదార్థాలు ఆరోగ్యానికి అద్భుతంగా పనిచేస్తాయి. వాటిలో ఒకటి పసుపు. రోజూ వంటల్లో వాడే పసుపు కేవలం రుచి కోసమే కాదు, మన గుండె ఆరోగ్యానికి కూడా ఒక అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. దీనిపై ప్రముఖ హృద్రోగ నిపుణుడు, కార్డియాలజిస్ట్ డాక్టర్ అనురాగ్ శర్మ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. పసుపు మన గుండెకు ఒక "బంగారు కవచం" లాంటిదని ఆయన చెప్పారు.







**గుండె ఆరోగ్యానికి పసుపు వల్ల కలిగే ప్రయోజనాలు**

ఈ సమాచారం కేవలం మీ అవగాహన కోసం మాత్రమే అని పేర్కొంటూ డాక్టర్ శర్మ, "మీ గుండె ఆరోగ్యం చాలా అమూల్యమైనది - దానిని రక్షించుకోవడానికి చర్యలు తీసుకోండి" అని సూచించారు.

**మంటను తగ్గిస్తుంది :**

పసుపులో ఉండే కర్కుమిన్ అనే క్రియాశీలక సమ్మేళనం, ధమనులకు హాని కలిగించే మంటను తగ్గిస్తుంది. నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం, కర్కుమిన్ అనేది 'కర్కుమినోయిడ్స్' అనే సహజ సమ్మేళనాల సమూహంలో ఒక భాగం. బ్రిటిష్ హార్ట్ ఫౌండేషన్ ప్రకారం, ఇది గుండె, రక్తప్రసరణ సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

**చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది:**

పసుపు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి, ధమనులలో ఫలకం పేరుకుపోకుండా నిరోధించడానికి సహాయపడుతుంది.

**రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తుంది:**

పసుపు రక్తనాళాల పనితీరును మెరుగుపరచి, శరీరంలో రక్త ప్రసరణను సాఫీగా జరిగేలా చేస్తుంది.

**బలమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది:**

పసుపు ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేసి, గుండె కణాలను దెబ్బతినకుండా రక్షిస్తుంది.

**పసుపు ఇంకా దేనికి ఉపయోగపడుతుంది?**

జాన్స్ హాప్‌కిన్స్ మెడిసిన్ నివేదిక ప్రకారం, మొక్కల ఆధారిత ఆహారాలు గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలను నివారించడంలో సహాయపడతాయి. శరీరంలో మంటను తగ్గించుకోవాలనుకునేవారు పసుపును తమ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. అంతేకాకుండా, ఇది ఆస్టియో ఆర్థరైటిస్, క్షీణించిన కంటి సమస్యలు, మెటబాలిక్ సిండ్రోమ్, హైపర్లిపిడెమియా (రక్తంలో కొలెస్ట్రాల్), ఆందోళన, కండరాల నొప్పులు, మూత్రపిండాల ఆరోగ్యానికి కూడా ఉపయోగపడుతుంది.

# జపనీస్ ఆహారపు అలవాట్లతో సాధ్యమే: డైటింగ్ అవసరం లేదంటున్న ఫిట్‌నెస్ కోచ్





బరువు తగ్గడం అంటే చాలామందికి డైటింగ్, క్యాలరీలు లెక్కబెట్టుకోవడం గుర్తొస్తుంది. అయితే, దీనికి భిన్నంగా, ఏ మాత్రం కష్టపడకుండానే ఆరోగ్యంగా, నాజూగ్గా ఉండొచ్చని ఒక ఫిట్‌నెస్ కోచ్ చెబుతున్నారు. దీని కోసం వేల ఏళ్ల నాటి ఒక జపనీస్ సూత్రాన్ని ఆయన వెల్లడించారు. 'హారా హచి బు' అనే ఈ పద్ధతిని పాటిస్తే, కడుపునిండా తింటూనే బరువు తగ్గడం సాధ్యమని ఆయన అంటున్నారు. మనం సాధారణంగా కడుపు నిండిందా లేదా అని ఆలోచించకుండా, ప్లేట్‌లో ఉన్న ఆహారం అంతా తినేస్తుంటాం. కానీ జపాన్‌లో తరతరాలుగా ఒక సాంస్కృతిక అలవాటు ఉంది, అదే 'హారా హచి బు'. దీని అర్థం "మీ కడుపులో 80% నిండే వరకు మాత్రమే తినండి". ఈ సూత్రం ఎలా పనిచేస్తుందో ఫిట్‌నెస్ కోచ్ లార్స్ మీడెల్ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో వివరించారు.







**జపనీస్ సూత్రం 'హారా హచి బు' అంటే ఏమిటి?**

"రెస్టారెంట్లు మిమ్మల్ని లావుగా చేస్తున్నాయని మీకు అనిపిస్తోందా? అయితే 'హారా హచి బు' అనే జపనీస్ సూత్రాన్ని నేర్చుకోండి" అని లార్స్ మీడెల్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "దీని ఉద్దేశం చాలా సులభం. మీరు మీ కడుపు 80% నిండింది అని అనిపించగానే తినడం ఆపేయండి. దీనికి క్యాలరీలు లెక్కించాల్సిన అవసరం లేదు, మీరు ఎంత తిన్నారో ట్రాక్ చేయాల్సిన పని లేదు. మీరు సగం తిన్న తర్వాత ఒక్కసారి ఆగి, 'నాకు ఇంకా ఆకలిగా ఉందా, లేదా నా ముందు ఆహారం ఉంది కాబట్టి తింటున్నానా?' అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి" అని లార్స్ అన్నారు.

**నెమ్మదిగా తినడం వల్ల లాభం ఏమిటి?**

ఈ జపనీస్ సూత్రం నెమ్మదిగా తినడాన్ని ప్రోత్సహిస్తుంది. దీనివల్ల మన శరీరానికి ఒక హార్మోన్‌ను విడుదల చేయడానికి తగిన సమయం లభిస్తుంది. అదే లెప్టిన్ . ఈ హార్మోన్ విడుదల అయితేనే మన కడుపు నిండినట్లు, ఇక చాలు అనే సంకేతం మెదడుకు అందుతుంది. దీంతో మనం త్వరగా సంతృప్తి చెందుతాం. శతాబ్దాలుగా జపాన్ ప్రజలు ఈ సూత్రాన్ని పాటించడం వల్ల అతిగా తినకుండా, పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోకుండా కాపాడుకోగలుగుతున్నారు. "మీ బరువు పెరగడానికి రెస్టారెంట్లు కాదు, మీ ఆహారపు అలవాట్లు కారణం" అని లార్స్ మీడెల్ స్పష్టం చేశారు. క్యాలరీల గురించి పదే పదే ఆలోచించడం, లేదా మీకు ఇష్టమైన భోజనాన్ని వదులుకోవడం లాంటివి అవసరం లేదని, ఆహారం పట్ల అవగాహన లేకపోవడం వల్లనే బరువు పెరగడం జరుగుతుందని | ఆయన వివరించారు.

# ఊహకందని మలుపులతో...



శ్రీరామ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ది మేజ్'. ప్రియాంక, హ్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు కీలక పాత్రలు పోషిస్తున్నారు. రవికిరణ్ గడలాయ్ దర్శకుడు. ఉదయ్ కె.రెడ్డి పాల్వాయి, కేఎస్ఆర్, భరత్‌రెడ్డి గోపు, అనిరుధ్ రెడ్డి సోమ నిర్మాతలు. సైకలాజికల్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని శనివారం విడుదల చేసింది చిత్రబృందం. దర్శకుడు మాట్లాడుతూ "వాస్తవం, భ్రమ మధ్యనున్న సరిహద్దుల్ని చెరిపేస్తూ, ప్రేక్షకుల అంచనాల్ని, ఆలోచనల్ని సవాల్ చేస్తూ సాగే చిత్రమిది. ఊహకు అందని మలుపులతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంద"న్నారు.

# కలిసే... జంట కలిసే!



'జిలి బిలి కన్ను కన్ను ఒక్కటిగా చేరంగా... చేతిలో చెయ్యి వేసి...' అంటూ పెళ్లి పాటతో కొత్త జోష్‌ని తీసుకొచ్చారు కథానాయకుడు సూర్య. పెళ్లి సందడిని పక్కాగా ఆవిష్కరించే ఈ పాట ఆయన కథానాయకుడిగా నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలోనిదే. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ఇది. సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. ఆగస్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులోని పెళ్లి పాటని శనివారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రచించిన ఈ పాటని కథానాయకుడు సూర్య ఆలపించారు. జి.వి.ప్రకాశ్‌కుమార్ స్వరపరిచారు. 'కలిసే... జంట కలిసే... కొత్త వరసే నేడు మొదలవగా...' అంటూ సందడిగా సాగే ఈ పాటలో సూర్య, మమితా బైజు కలిసి చేసిన నృత్యాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. వివాహంలోని ఆనందాన్ని, ఆత్మీయతని కళ్లకు కట్టే పాట ఇదని సినీ వర్గాలు చెప్పాయి.

# కారు కొనుక్కోవడానికే సినిమాల్లోకి వచ్చా: రకుల్ ప్రీత్‌సింగ్



కారు కొనాలనే కోరికతో నటించిన తొలి సినిమానే తనని ఈ రోజు కెమెరా ముందు నిలబెట్టిందని అంటోంది కథానాయిక రకుల్ ప్రీత్‌సింగ్. ఇటీవల 'రైజింగ్ భారత్ సమ్మిట్'లో పాల్గొన్న ఆమె ఇండస్ట్రీలో కెరీర్ ప్రారంభించడం గురించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంది. "నేను కాలేజీలో చదువుతున్నప్పుడే అనుకోకుండా కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి నాకొక అవకాశం వచ్చింది. ఎవరో కొంతమంది నా ఫొటోలు చూసి మా నాన్నని కలిశారు. ఓ సినిమాలో నటించేందుకు నన్ను తీసుకుంటామని అడిగారు. అప్పుడు నాకేం చెప్పాలో అర్థం కాలేదు. సినిమాలపై అప్పడంతగా అవగాహన లేదు. కానీ, వాళ్లు ఆ సినిమాకు నాకు రూ.5 లక్షల పారితోషికం ఇస్తామన్నారు. వాటితో కారు కొనుక్కోవాలి.. నా స్నేహితులందరిలో కారు ఉన్న మొదటి అమ్మాయిని నేనే అవుతానన్న ఒకే ఒక్క కారణంతో ఆ సినిమా చేయడానికి అంగీకరించాను. 40 రోజులు షూటింగ్‌లో పాల్గొన్నాను. అప్పడే గ్రహించా కెమెరా ముందు ఉండడం నాకు ఎంతగానో ఇష్టమని. ముందు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి తర్వాత నటనలోకి రావాలని నిర్ణయించుకున్నా. అందుకే కొంత విరామం తీసుకుని 2013లో చిత్రపరిశ్రమలోకి వచ్చాను. ఎవరి ప్రమేయం లేకుండానే ఇండస్ట్రీలో అడుగుపెట్టాను. నాకు నేనుగా అన్నీ నేర్చుకున్నా. ప్రారంభంలో చదువు కారణంగా కొన్ని పెద్ద సినిమాల్ని వదులుకోవల్సి వచ్చింది"అని అంది రకుల్. 2009లో కన్నడ చిత్రం 'గిల్లీ'తో వెండితెరకు పరిచయమైన ఆమె తిరిగి 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్'(2013)తో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టింది. ఇప్పుడామె త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న హిందీ చిత్రం 'రామాయణ'లో శూర్పణఖగా కనిపించనుంది.

# వినోదాల... సౌండ్ ఇంజినీర్



కథానాయకుడు నారా రోహిత్ సరికొత్త కథతో ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమయ్యారు. ఆయన.. కథానాయిక నయన్ సారిక జంటగా రూపొందుతున్న సినిమా 'సౌండ్ ఇంజినీర్'. చినిమిల్లి మణికుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని భరత్ చౌదరి చెరుకూరి నిర్మిస్తున్నారు. శనివారం రోహిత్ పుట్టిన రోజు సందర్భంగా ఓ కాన్సెప్ట్ వీడియోతో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో కొత్త అవతారంలో కనిపిస్తున్న రోహిత్ పాత్రని వినికిడి లోపం ఉన్న వ్యక్తిగా తీర్చిదిద్దినట్టు స్పష్టం చేసింది. ఈ సినిమాలో నరేశ్ వీకే, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, రోహిణి, సంపత్, అజయ్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి.

---

## అనాహత్ విజయం దేశ యువతకు

# స్ఫూర్తిదాయకం : ప్రధాని మోదీ



ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌గా నిలిచిన భారత యువ సంచలనం అనాహత్ సింగ్‌ను ప్రధాని మోదీ అభినందించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్ వేదికగా ప్రశంసించారు. అనాహత్ విజయం దేశానికి గర్వకారణమన్నారు. ఈ ఘనత భారత స్క్వాష్ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్తతరం క్రీడాకారులకు ఈ విజయం స్ఫూర్తిగా నిలుస్తుందని.. యువతలో స్క్వాష్ క్రీడపై ఆసక్తిని మరింత పెంచుతుందని ప్రధాని మోదీ తన సందేశంలో తెలిపారు.

ప్రపంచ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ 2026 టైటిల్ ను గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా అనాహత్ సింగ్ రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 20వ స్థానంలో ఉన్న అనాహత్.. రుకాయ సాలెమ్ (ఈజిప్ట్)ను ఓడించింది. ఈ టోర్నీలో పతకం సాధించడం అనాహత్‌కు ఇది వరుసగా రెండోసారి. నిరుడు కాంస్యం నెగ్గిన ఆమె ఈసారి స్వర్ణం చేజిక్కించుకుంది. 18 ఏళ్ల ఈ యువ క్రీడాకారిణి ఇప్పటికే ఎన్నో రికార్డులను తన ఖాతాలో వేసుకుంది. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ తరఫున పాల్గొన్న అత్యంత పిన్నవయస్కురాలిగా (14 ఏళ్లు) రికార్డు సృష్టించింది. అదే ఏడాది ఆసియా క్రీడల్లో రెండు కాంస్య పతకాలు (మహిళ టీమ్, మిక్స్‌డ్ డబుల్స్) గెలుచుకుంది. సీనియర్ జాతీయ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో 2023 నుంచి వరుసగా మూడేళ్లపాటు విజేతగా నిలిచింది. అనాహత్ సింగ్ 2008 మార్చి 13న దిల్లీలో జన్మించిం ది. ఒలింపిక్ విజేత పి.వి. సింధు ఆమెకు స్ఫూర్తి. తొలుత బ్యాడ్మింటన్ ఆడిన అనాహత్.. తన సోదరి అమీరాను చూసి స్క్వాష్‌వైపు ఆకర్షితురాలైంది. 10 ఏళ్ల వయసులోనే దీనిని ప్రొఫెషనల్ గేమ్‌గా ఎంచుకుంది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్ గేమ్స్‌లో తొలిసారిగా స్క్వాష్‌ను చేర్చారు. అందులో ఆడి భారత్‌కు బంగారు పతకం తీసుకురావడమే తన లక్ష్యమని అనాహత్ చెబుతోంది.

# టీమిండియాలో బౌలింగ్ ఆల్‌రౌండర్ కొరత..?



2027 ప్రపంచకప్‌నకు సిద్ధమవుతున్న టీమిండియాలో బౌలింగ్ ఆల్‌రౌండర్ కొరత తీవ్రంగా ఉన్నట్లు మాజీ ఆటగాడు కృష్ణమాచారి శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. కీలక ఆటగాళ్లను జట్టు నుంచి పక్కనపెట్టడాన్ని కూడా తప్పపట్టాడు.

"దూబే, హర్షిత్ రాణా వంటి ఆటగాళ్లు ఆల్‌రౌండర్లు కాదు. వీరిని ఆల్‌రౌండర్లు అంటే.. నాకు నేను గొప్ప ఆల్‌రౌండర్‌ను అని చెప్పొచ్చు. జట్టులో హార్దిక్ ఒక్కడే నిజమైన ఆల్‌రౌండర్. నితీశ్ కుమార్ రెడ్డి హాఫ్ ఆల్‌రౌండర్. అతడు 7వ స్థానంలో బ్యాటింగ్ చేయడంతోపాటు.. కొన్ని ఓవర్లు వేయగలడు.

మరోవైపు రవీంద్ర జడేజా వన్డేల నుంచి పూర్తిగా వైదొలగాడని నేను అనుకోవడంలేదు. 2023 ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించాడు. అతడు ఓ సైలెంట్ కిల్లర్. వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించలేదు. టెస్టుల్లో అద్భుతంగా రాణించినా అతడికి వన్డే జట్టులో మాత్రం చోటు దక్కడంలేదు. రాణిస్తే జట్టులోకి కూడా తీసుకోవాలి' అని శ్రీకాంత్ పేర్కొన్నాడు. ప్రస్తుతం హార్దిక్ బీసీసీఐ సీవోఈలో పెర్ఫార్మెన్స్ బ్లాక్ ప్రోగ్రామ్‌లో ఉన్నాడు.

## 2027 ప్రపంచకప్ జట్టుకు

# భువీ అవసరం: అశ్విన్




టీమ్ ఇండియాలో నాణ్యమైన సీమర్ల కొరత ఉందని మాజీ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఈ క్రమంలో భువనేశ్వర్ కుమార్ ను జట్టులోకి తీసుకునే విషయమై బీసీసీఐ పరిశీలించాలని సూచించాడు. ఆర్సీబీ వరుసగా ఐపీఎల్ టైటిల్స్ గెలుచుకోవడంలోనూ అతడి పాత్ర ఉందని గుర్తు చేశాడు.

"ప్రస్తుతం మన ఫాస్ట్ బౌలింగ్ పరిస్థితి చూస్తే భువనేశ్వర్ పేరును ఎందుకు పరిశీలించకూడదు అనిపిస్తోంది. భువీ గత రెండు సీజన్లుగా ఫిట్‌గా ఉంటూ ఆర్సీబీకి ఆడాడు. ఆ రెండు సార్లూ ఆ జట్టు టైటిల్స్ గెలిచింది. ఆ జట్టు విజయానికి ప్రధానమైన మూడు కారణాల్లో భువీ ఒకడు. అలా అని అతడిని నేరుగా జట్టులోకి తీసుకోమని చెప్పడం లేదు. ఒక్క అవకాశం ఇచ్చి చూసి.. అప్పుడు నిర్ణయం తీసుకోండి. భువీ బంతిని స్వింగ్ చేయగలడు, డెత్ ఓవర్లు అద్భుతంగా బౌలింగ్ చేయగలడు, బ్యాటింగ్‌లోనూ రాణించగలడు" అని అశ్విన్ అన్నాడు.

"ప్రస్తుతం మన బౌలింగ్ దళంలో అనుభవలేమి కనబడుతోంది. గుర్నూర్ బ్రార్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్ లాంటి వారితో ప్రపంచ కప్ ఆడాలనుకుంటున్నారా? నేను కచ్చితంగా అనుకోను. వీరిలో ఒకరో ఇద్దరో మాత్రమే ప్రపంచ కప్ జట్టులో ఉండొచ్చు. వీరికి తోడు హర్షిత్, బుమ్రాకు భువీ కూడా కలిస్తే.. బౌలింగ్ దళం అనుభవజ్ఞులతో నిండుతుంది. కొత్త ఆటగాళ్లను తయారు చేయడానికి ఈ 12 కీలకమైన నెలలు సమయం కాదు. ఇప్పటికే హర్షిత్‌కు అవకాశం ఇచ్చారు. అతడు ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ చేయగలడు. బ్రార్, ప్రసిద్ధ్‌కు ఛాన్స్ ఇచ్చారు. వారిని జట్టు నుంచి తొలగించి మరింత మంది కొత్త బౌలర్లను తీసుకొచ్చి చూసే అవకాశం లేదు. ఐదుగురు పేసర్లను ఎంచుకోండి... వారిలో ముగ్గురిని ప్రపంచకప్‌నకు తీసుకెళ్లండి. అందుకే.. భువనేశ్వర్ వంటి వారిపై చర్చించాల్సిన అవసరం ఉంది" అని అశ్విన్ వివరించాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945